పెన్ పవర్
తెలంగాణ రౌండప్




# 'రుద్ర'కన్‌స్ట్రక్షన్‌కి..! 'రూల్స్' వర్తించవా..?

**పేరుకే 'హెచ్ఎండిఏ' పర్మిషన్..! ఇష్టానుసారంగా 'కన్‌స్ట్రక్షన్'..!**




రుద్ర కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించిన స్కెచ్ మ్యాప్..

- నిజాంపేట్ సర్కిల్ పరిధిలో.. 200 ఫీట్ల రహదారిపై, రెసిడెన్షియల్ అనుమతులు..
- ఫుట్ పాత్ ఆక్రమణలు.. అక్రమ నిర్మాణం ఆరోపణలపై స్పందించని అధికారులు..
- నిర్మాణం చుట్టూ 6 మీటర్‌లు(19.82 అడుగులు) సెట్‌బ్యాకులు..
- ముందుకు 10.72 మీటర్ల(35 ఫీట్లు) పర్మిషన్‌లో స్పష్టంగా ఉంది..
- అనుమతులు ఇచ్చినోళ్ళు ఆరా తీయరు.. లోకల్‌బాడీ పర్యవేక్షణ ఉండదు..
- నిబంధనలు ఉల్లంఘించినా..! అక్రమ నిర్మాణాల నియంత్రణ శూన్యం..
- పర్యవేక్షణ కోసం నియమించిన చైన్‌మెన్‌లు సెటిల్మెంట్‌లకే పరిమితమా..?

-4లో




200 ఫీట్ల రహదారి వైపు నిబంధనలు ఉల్లంఘించిన రుద్ర కన్‌స్ట్రక్షన్..

- పర్మిషన్ గిర్మిషన్ జాన్తా నై.. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు కట్టుకోవడమే..?
- హెచ్ఎండిఏ పర్మిషన్‌తో.. బెత్తెడు కూడా గ్యాపు లేకుండా నిర్మాణం ఏంటి..?
- చుట్టూ ఫైర్ ఇంజన్‌లు తిరగాల్సిన చోట చీమలకు కూడా అవకాశం లేదంటే అర్థం.?
- అనుమతులు ఒకలా..! నిర్మాణం ఇంకొకలా..! రుద్ర కన్‌స్ట్రక్షన్ బరితెగింపు..!

ఎంతైనా పేరు మోసిన నిర్మాణ సంస్థల, అక్రమ నిర్మాణాలకు అండగా ఉండటం సహజం..! ఒకరు పలుకుబడితో, మరొకరు ప్రలోభ పెట్టో, ఇంకొకరు భయపెట్టో, కారణం ఏదైనా..! చివరికి అక్రమ నిర్మాణాలు 'కామన్' అయిపోతున్నాయి.. 'హెచ్ఎండిఏ-మున్సిపల్' అధికార యంత్రాంగానికి కూడా ఇదంతా కొత్తేమికాదు.. కాకపోతే ప్రశ్నించిన వారికి ఒక సమాధానం చెప్పాలి కాబట్టి, అధికారులు అందరూ 'కమల్‌హాసన్‌లే' అవుతారు.. నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధిలో ఇలాంటి దందా గురించి తెలియనిది కాదంటూ ఆరోపణలెన్నో ఉన్నాయి..! ఉదాహరణకు రాజీవ్‌గాంధీ నగర్‌లో "ఆకాశహర్మ్యాలు".. బాచుపల్లిలో " అనుమతుల్లేని" బహుళ అంతస్తులు, 'రెడ్డీస్ అవెన్యూ'లో ప్రభుత్వ భూమి ఆక్రమణతో అక్రమ నిర్మాణం, ఇవన్నీ కరప్షన్ అధికారుల కనుసన్నల్లోనే నిర్మించినట్లు అధికారులే పరోక్షంగా నిర్ధారిస్తున్నారు.. అధికారులు కూడా లాభం చేకూరే ఇలాంటి అక్రమ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.. ఎందుకంటే ఏస్థాయి అధికారులనైనా ఇట్టే మేనేజ్ చేసేంత శక్తి సామర్థ్యం కిలిగిన నిర్మాణ సంస్థలు, బిల్డర్‌లను ఇబ్బంది పెట్టరని వినికిడి.. వీటన్నింటికి బిన్నంగా ఇప్పుడు "రుద్ర' కన్‌స్ట్రక్షన్‌కి సంబంధించిన భారీ నిర్మాణం వివాదాస్పదంగా తయారైంది.. 1066.82 చదరపు మీటర్ల స్థలానికి "పర్మిషన్" తీసుకున్న నిర్మాణ సంస్థ, ప్రమాదకర అక్రమ భారీ నిర్మాణానికి తెరలేపింది.. నిబంధనలు ఉల్లంఘించిన అక్రమ కట్టడంలో దర్జాగా పనులు సాగుతున్నాయి.. నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎక్కడ..? నియంత్రణకై నియమించిన ఆ చైన్‌మెన్‌లు ఎక్కడ..? అంతా మామూళ్ళ మత్తులో జోగుతున్నారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 3

## రూ.100 కోట్లకు పైగా ఆస్తులు..

### మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుపై అక్రమాస్తుల కేసు నమోదు




**హైదరాబాద్ పెన్ పవర్:** సస్పెన్షన్‌లో ఉన్న మాజీ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావుపై తెలంగాణ ఏసీబీ అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. భుజంగరావు ఇళ్లల్లో ఏసీబీ సోదాలు ముగిశాయి.

- మిగతా 4లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

- శభాష్ దుండిగల్ 'టౌన్‌ప్లానింగ్'..! అని మెచ్చుకోవాల్సిందే..!
- సీజ్‌చేసిన అధికారులే అనుగ్రహించారా..? షాలోమ్ స్కూల్‌లో దర్జాగా పనులు..!
- చట్టాలను అతిక్రమించి- నిబంధనలు ఉల్లంఘించినా చర్యల్లేవంటే అర్థం..?
- కప్పం కట్టించుకున్నాకే దారి సుగమం అయిందా..? ఏ ప్రాతిపదికన సార్లూ..?
- షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు విద్యాశాఖ అనుమతులు కూడా లేవు..
- నిర్మాణ అనుమతులు లేకపోతే ఏంటి..! అధికారుల అండ ఉందిగా..!
- నిర్మాణం పూర్తి అయ్యాక అనుమతులు ఇచ్చుడేంది..? కొత్త సంస్కృతి మార్గమా..?
- నిర్మాణ చట్టాలకు విలువ ఇవ్వని దుండిగల్ సర్కిల్-59 అధికారులు..
- అక్రమార్కులకు ప్రత్యేక ప్రాధాన్యత.. అక్రమ నిర్మాణాలకు సానుకూలత..!

డిప్యూటీ కమిషనర్- టౌన్‌ప్లానింగ్ ఏసిపి సమక్షంలో షాలోమ్ సీజ్..







# సీజ్ చేసిన సార్లూ..! ఈ పనులు చేసుడేంది..?

- డిప్యూటీ కమిషనర్-అసిస్టెంట్ సిటీ ప్లానర్ సమక్షంలోనే 'సీజింగ్' ప్రక్రియ..
- విధులు నిర్వర్తిస్తున్నారా..? ఆదాయ వనరులు వెతుక్కుంటున్నారా..?
- దుండిగల్ సర్కిల్‌లో నిబంధనలతో పనిలేదు..! నిధులే లక్ష్యం..!

అనుమతులు లేని బౌరంపేట్ "షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో" శరవేగంగా నిర్మాణ పనులు సాగుతున్నాయి.. హాస్యాస్పద విషయం ఏమిటంటే.. స్వయంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసిపి సమక్షంలోనే సీజ్‌చేసిన అక్రమ నిర్మాణాల్లో యధేచ్ఛగా పనులు చేపట్టడం గమనార్హం.. విద్యాశాఖ పర్మిషన్ లేదని, చర్యలు తీసుకుంటామని సంబంధిత విద్యాశాఖ అధికారి స్పష్టత ఇస్తుంటే..! బిల్డింగ్ అనుమతులు లేవన్న టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం, రెండు మూడు రోజుల్లో పర్మిషన్‌లు వస్తున్నాయని ప్రచారం చేస్తున్నారట.. అందుకే కాబోలు ఆరంభం నుండి నిరాటంకంగా పనులు సాగుతున్నాయి.. మొత్తం మీద తీసుకున్న కూలికి, పనులు చేస్తున్నట్టు పలువురు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.. టిజి-బిపాస్ బిల్డ్‌నవ్ చట్టాలను నిర్వీర్యం చేస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు.. వక్రమార్గంలో తమ చట్టాలను అమలు చేస్తున్నారన్న స్థానికుల ఆరోపణలకు అధికారులు బలం చేకూరుస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 3:




సీజ్‌చేసిన ఇక్కడే పాఠశాల ప్రధాన ద్వారం పనులు..




సీజ్ చేసిన చోటనే దర్జాగా పనులు..

-5లో

# ‘రుద్ర’ కన్‌స్ట్రక్షన్‌కి..! ‘రూల్స్’ వర్తించవా..?




రుద్ర కన్‌స్ట్రక్షన్ వెనుకవైపు ఉన్న 20 ఫీట్ల రోడ్డు ఆక్రమణ, సెట్‌బ్యాకులు లేనిది స్పష్టంగా కనిపిస్తుంది..




రుద్ర కన్‌స్ట్రక్షన్ వెనుకవైపు 6 మీటర్ల సెట్‌బ్యాకులు, రోడ్డును ఆక్రమించి నిర్మాణం..

## ‘రుద్ర’ కన్‌స్ట్రక్షన్‌కి..! ‘రూల్స్’ వర్తించవా..?

హెచ్‌ఎండిఏ నిబంధనలు కొందరికేనా..! బడా నిర్మాణ సంస్థలకు రూల్స్ వర్తించవా..? అన్న ప్రశ్నలు వస్తున్నాయి.. నిజాంపేట్ సర్కిల్-58 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో 200 ఫీట్ల రహదారి పక్కన నిర్మిస్తున్న ‘రుద్ర’ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన హెచ్‌ఎండిఏ నుండి రెసిడెన్షియల్ బిల్డింగ్ కోసం, బాచుపల్లి సర్వే నెం. 135/పార్ట్, 136లో.. ప్లాట్ నెంబర్: 34, 35, 71 అండ్ 72 కు సంబంధించిన స్థలం 1066.80 చదరపు మీటర్ల(1274 గజాలకు) స్థలానికి రుద్ర కన్‌స్ట్రక్షన్ సంస్థ అనుమతులు పొందారు.. 2 (డబుల్) సెల్లార్ం 1 గ్రౌండ్ ం 5 అప్పర్ ఫ్లోర్స్‌కు హెచ్‌ఎండిఏ నుండి పర్మిషన్ తీసుకున్నారు.. నిర్మాణం మాత్రం అనుమతులకు విరుద్ధంగా, నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం చేపడుతుంటే.. నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది..

## సెట్‌బ్యాకులు ‘జీరో’..! రహదారి ఆక్రమణ..?

బాచుపల్లిలోని ‘రుద్రా కన్‌స్ట్రక్షన్‌పై అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..? రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణ ఆరోపణలపై అధికారుల మౌనం ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.. సంబంధిత కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి, హెచ్‌ఎండిఏలో సమర్పించిన ప్లాన్ ప్రకారం, నిర్మాణం చుట్టూ (మూడు వైపులా) సెట్‌బ్యాకులు 6 మీటర్లు (19.82 అడుగులు) ఉండాలి.. ముందువైపున ప్లాన్ ప్రకారం 10.72 మీటర్లు (35 ఫీట్లు) వదిలేయాలని అధికారికంగా, పర్మిషన్ స్కెచ్ ప్లాన్‌లో స్పష్టంగా పొందుపరిచారు..అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించిన, బడా నిర్మాణ సంస్థ ‘రుద్ర’ కన్‌స్ట్రక్షన్ బిల్డర్, హెచ్‌ఎండిఏ నుండి పొందిన పర్మిషన్‌కు విలువ లేకుండా చేశారు.. ప్రమాదాల నుంచి తప్పించుకునేందుకు వీలుగా సూచించిన, 6 మీటర్ల సెట్‌బ్యాకుల నిబంధనలు సైతం అతిక్రమించి నిర్మాణం, కొనసాగటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. ఈ వ్యవహార నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి..




200 ఫీట్ల రహదారిపై రెసిడెన్షియల్ అనుమతుల నిర్మాణం..

- 3 పేజి తరువాయి

పరిపాలనా సౌలభ్యం పత్తాలేదు..! కొత్తగా విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లతో కలిపి 300 డివిజన్‌లుగా సిద్ధమైన, జీహెచ్‌ఎంసి కార్ఫోరేటర్ డివిజన్‌లను, పరిపాలనా సౌలభ్యం కోసం 3 విభాగాలు విభజించి నప్పటికీ..! వివిధ సర్కిల్‌లకు చెందిన టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ప్రమాదకర అక్రమ నిర్మాణాలతో ప్రజలను రిస్కులో పెడుతున్నారు.. అందులో ఇప్పుడు కీలకంగా బరితెగింపు విధుల్లో మొదటి స్థానం దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ కాగా..! రెండవ స్థానం నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పట్టణ ప్రణాళికలో అంతా బహిరంగంగానే జరుగుతుండటంపై సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఈ వ్యవహారంలో నిత్యం ఫిర్యాదులు, పత్రికా కథనాలు వచ్చినా బేఖాతర్ చేస్తున్నారని స్పష్టమవుతుంది.. పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా “తిలాపాపం తలాపిడికెడు”గా తయారైందని పలువురు వ్యంగ వ్యాఖ్యలు చేస్తున్నారు.. ఈ విషయంలో “సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్ అలసత్వం..! కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ నిర్లక్ష్యం తేటతెల్లం అవుతుంది..! దీంతో నిజాంపేట్ సర్కిల్-58 డిప్యూటీ కమిషనర్ వైఫల్యంతో పర్యవేక్షణ పూర్తిగా విఫలమైంది..! చివరికి టౌన్‌ప్లానింగ్ అధికారుల నిజాయితీ మాటలకు, ఇక్కడ జరుగుతున్న అక్రమ కట్టడాలకు అస్సలు పొంతన లేకుండా పోతోంది..

## ఫిర్యాదు చేసి నెలరోజులు: ఆకుల సతీష్..

రుద్ర కన్‌స్ట్రక్షన్ నిబంధనలు ఉల్లంఘించారని, దాదాపు నెలరోజుల క్రితమే నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామని, కనీసం నోటీసులు కూడా, ఇవ్వలేదని ఆకుల సతీష్ ఆరోపించారు.. నిబంధనల ఉల్లంఘన ప్రారంభం నుండే తెలిసిపోతుంది.. అయినప్పటికీ 2 సెల్లార్‌లు + 1 గ్రౌండ్ + 5 పై అంతస్తులకు గాను 3 నిర్మించినా, అధికారులు ఇప్పుడు నోటీసులు జారీచేశామని, చెప్పడం విడ్డూరంగా ఉందని సతీష్ తెలిపారు.. 00507/BP/HMDA/ 1955/MED/2022 దరఖాస్తు నంబరుతో రుద్రా కన్‌స్ట్రక్షన్‌కు 1066.80 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి అనుమతి మంజూరైంది.. ఫిర్యాదులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1955లోని పలు సెక్షన్లను ప్రస్తావించారు..సెక్షన్ 428 అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు.. సెక్షన్ 433 అక్రమ నిర్మాణాల మార్పు లేదా కూల్చివేత అధికారాలు..సెక్షన్ 452 రోడ్లు, వీధులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపు.. సెక్షన్ 461 మున్సిపల్ నిబంధనల ఉల్లంఘనపై శిక్షలు వంటి నిబంధనలను ఉల్లంఘించారని ఫిర్యాదులో ఆరోపించారు.. మున్సిపల్, హెచ్‌ఎండిఏ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని సతీష్ డిమాండ్ చేశారు.

## టౌన్‌ప్లానింగ్ అధికారులనూ.. ‘బురిడి’ కొట్టించిన ‘రుద్ర’..

నిబంధనలు ఉల్లంఘించిన ‘రుద్ర’ కన్‌స్ట్రక్షన్ విషయాన్ని, నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారితో ప్రస్తావించగా, దాదాపు రెండు వారాల క్రితమే, డాక్యుమెంట్‌లు కాల్ ఫర్ చేస్తానని ‘పెన్ పవర్’ ప్రతినిధితో చెప్పారు.. తీరా మంగళవారం మరోసారి టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసిపితో ప్రస్తావించగా, సంబంధిత నిర్మాణదారులు తమను ‘బురిడి’ కొట్టించారని, సంబంధం లేని, తప్పుడు పర్మిషన్ కాపిలు సమర్పించారని పెన్ పవర్ ప్రతినిధితో, టౌన్‌ప్లానింగ్ ఏసిపి తెలిపారు.. అయితే పెన్ పవర్ ప్రతినిది నిజమైన అనుమతుల కాపీని, స్కెచ్ ప్లాన్‌ను అధికారులకు సమర్పించడంతో, ఫీల్డ్ విజిట్ చేసి, చట్టప్రకారం షోకాజ్ నోటీసులు పంపిస్తామని తెలిపారు..

## ఆఫీసుకు వస్తేనే.. వివరణ ఇస్తాం..!: నిజాంపేట్ సర్కిల్-58 ఏసిపి..

రుద్ర కన్‌స్ట్రక్షన్ నిబంధనల ఉల్లంఘనపై ‘పెన్ పవర్’ ప్రశ్నిస్తే..! ఏమి తెలియనట్టు వ్యవహరిస్తున్న నిజాంపేట్ సర్కిల్-58 టౌన్‌ప్లానింగ్ అధికారులు.. మంగళవారం మాత్రం ఫోన్‌లోనే, తమ సిబ్బందిని పంపించి వివరాలు చెపుతామని తెలిపిన ఏసిపి సమాధానం, బుధవారం నాటికి మరోరకంగా ఉంది.. టౌన్‌ప్లానింగ్ ఏసిపి ఫోన్‌లో ప్రయత్నించిన ప్రతిసారీ, స్పందించి సమాధానం భాగానే ఉండేది. బుధవారం మాత్రం, వార్తకు వివరణ కోరగా, ఫోన్‌లో చెప్పడం కుదరదని, ఆఫీస్‌కు వస్తేనే చెపుతామని అనడం పలు అనుమానాలకు తావిస్తోంది.. వార్డు ఆఫీసర్‌తో కలిసి చెపుతామని చెప్పడం గమనార్హం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న కాలంలో, ఆఫీసుకు వస్తేనే చెపుతామని అనడం విశేషం..

# రూ.100 కోట్లకు పైగా ఆస్తులు.. మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుపై అక్రమాస్తుల కేసు నమోదు

-3 పేజి తరువాయి

మార్కెట్ రేట్ ప్రకారం రూ.100 కోట్లకు పైగా భుజంగరావు ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

భుజంగరావుకు చెందిన 16 చోట్ల ఏసీబీ తనిఖీలు చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భుజంగరావును ఏసీబీ అరెస్ట్ చేసింది. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. హైదరాబాద్‌లోని భుజంగరావు నివాసంతో పాటు 15 ప్రాంతాల్లో ఒకే సమయంలో సోదాలు జరిగాయి.

సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. 5 ఓపెన్ ప్లాట్లు, 2 ఇళ్లు, 1 కమర్షియల్ భవనం గుర్తించారు. ఇంట్లో రూ.3.83 లక్షల నగదు, రూ.8 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. సుమారు 1 కిలో బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మారుతి స్విఫ్ట్, కియా సెల్టోస్ కార్లు గుర్తించారు.గుర్తించిన ఆస్తుల మొత్తం విలువ రూ.5.92 కోట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించారు. మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే మరింత ఎక్కువగా ఉండొచ్చని ఏసీబీ అంచనా వేసింది. దాదాపు రూ.100 కోట్లకు పైగా మార్కెట్ విలువ ఉండొచ్చని ఏసీబీ పేర్కొంది. సోదాల్లో 29 మద్యం బాటిళ్లు కూడా లభ్యమయ్యాయి. నిందితులను నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టులో రిమాండ్ కోసం హాజరుపరుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో తీగల కృష్ణారెడ్డి, లంకల దీపక్ రెడ్డికి సిట్ నోటీసులు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డికి షాక్ ఇచ్చింది సిట్. ఈ కేసుకి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది సిట్. ఈమేరకు దీపక్ రెడ్డికి ఫోన్ కాల్ చేశారు సిట్ అధికారులు. విచారణకు ఎప్పుడొస్తారో చెప్పాలంటూ ఫోన్ కాల్ అడిగారు అధికారులు. ప్రశిక్షణ తరగతులు జరుగుతున్న క్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు అడిగి చెబుతానని బదులిచ్చారు దీపక్ రెడ్డి రెండు మూడు రోజుల్లో దీపక్ రెడ్డి సిట్ ముందు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ పాదయాత్ర, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కిషన్ రెడ్డి దగ్గర పని చేశారు దీపక్ రెడ్డి. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గా పోటీ చేశారు లంకల దీపక్ రెడ్డి.

( జూన్ 4 ) ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరుకావాలంటూ తీగల కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది సిట్. 2014-18 మధ్య మహేశ్వరం ఎమ్మెల్యేగా ఉన్నారు తీగల కృష్ణారెడ్డి.

# సీజ్ చేసిన సార్లూ..! ఈ పనులు చేసుడేంది..?



అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌కి సీల్ తొలగించిన దృశ్యం..

ఇక్కడే సీజ్‌చేసిన ఆనవాళ్ళు తొలగించారు..





ఆ సీజ్ తొలగించిన చోటనే ఈ నిర్మాణం..










'షాలోమ్ స్కూల్' సీజింగ్ ప్రక్రియలో ఫొటోషూట్..

**అక్రమ నిర్మాణాలుగా గుర్తించిన నూతన డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్, ఏసీపీ పర్యవేక్షణలోనే సంబంధిత భవనాలు సీజ్‌చేసిన అధికారులే పనులు చేసుకునే వెసులుబాటు కల్పించారంటే, అధికారుల అవినీతి తారా స్థాయికి చేరుకుందని విమర్శలు వినిపిస్తున్నాయి.. ఒకవైపు సీజింగ్ చర్యలు, మరోవైపు అదే సీజ్ తొలగించి పాఠశాల సింహద్వారం పనులు శరవేగంగా చేపడుతున్నారు.. సీజ్ చేసిన నిర్మాణాల్లో తిరిగి పనులు ఎలా ప్రారంభమయ్యాయి..? ఎవరి అనుమతితో జరుగుతున్నాయి..? సీజ్ ఉత్తర్వులకు విలువలేదా..? అక్రమ కట్టడాల నియంత్రణలో దుండిగల్ టౌన్‌ప్లానింగ్ విఫలం కావడానికి ప్రధాన కారణం ముడుపులేనా..? అన్న ప్రశ్నలు స్థానికుల్లో చర్చకు దారితీస్తున్నాయి.. ఏసిబి దాడులు జరిగిన కార్యాలయంలో ఇంత బరితెగించి ప్రమాదకర అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..**

-3 పేజి తరువాయి

అధికారుల అండా దండా ఉండాలే కానీ, కన్జర్వేషన్ జోన్‌లో అయినా, సీజ్ చేసిన అక్రమ నిర్మాణాల్లో అయినా సరె..! దర్జాగా పనులు చేసుకోవచ్చని దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిరూపితమైంది.. అధికారుల చర్యలను అధికారులే అతిక్రమించడం ఇక్కడ అంతా మామూలేనని మరోసారి నిరూపించారు.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలోని బౌరంపేట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా.. "షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్" నిర్మాణాలు చేపడుతుంటే, అధికారులు చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.. నిర్మాణ అనుమతులు లేవని అధికారులే స్వయంగా చెబుతుండగా, విద్యాశాఖ అనుమతి కూడా లేదని, తిరస్కరించామని, స్థానిక విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.. ఈ నేపథ్యంలో, అక్కడ శరవేగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు సంబంధించి గతంలోనే అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణం పూర్తయింది.. ఆ విద్యాసంస్థకూ పర్మిషన్ లేదు..

## అధికారుల ముందస్తు ప్లాన్‌లో భాగంగమేనా..?

దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్ అక్రమ నిర్మాణ దారులతో, ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నారా..? అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఏ ప్రాతిపదికన మంజూరు చేస్తారు..? ఇదంతా ముందస్తు ప్లాన్‌లో భాగంగానే గత 4 నెలలుగా షాలోమ్ స్కూల్ అక్రమ నిర్మాణాలపై ఓవైపు పనులు నిలిపివేశామని, చెపుతూనే, మరోవైపు సీజ్‌చేస్తూనే, సహకరిస్తున్నారా..? మీడియా ప్రశ్నించిన ప్రతిసారీ 'డబ్బు- పలుకుబడి' ఉన్నోళ్ళకు ఇవన్నీ మామూలే అన్న మాటలకు అర్థం..? అంటే దుండిగల్ సర్కిల్ అధికారులు కూడా ఆ ఉన్నోళ్ళకు అన్న 'ఫార్ములా'ను ఫాలో అవుతున్నారా..?

## షాలోమ్ అక్రమ నిర్మాణాలకు.. పర్మిషన్‌లు వస్తున్నాయట..!

విధులంటే బాధ్యత లేదు.. చట్టాలంటే గౌరవం లేదు.. చర్యలంటే అసలు లెక్కేలేదు..!ఎలాంటి అక్రమ కట్టడాలైనా ఇట్టే సక్రమం చేసే, ఖతర్నాక్ యంత్రాంగం రంగంలోకి దిగింది.. టిజి-బిపాస్ బిల్డ్‌నవ్ చట్టాలను కూడా నిద్రపుచ్చే సత్తాఉన్న అధికారులు..? దుండిగల్ సర్కిల్ పట్టణ ప్రణాళికలో ఎంతటి ప్రమాదకర అక్రమ నిర్మాణాలైనా సక్రమం చేస్తున్నారట.. ఇప్పటికే బహుదూర్‌పల్లిలో నాలుగు, టెక్ మహీంద్రా ఎదురుగా ఒకటి, గండిమైసమ్మ తాజా హోటల్ పక్కన భారీ నిర్మాణం, మల్లంపేట్, బౌరంపేట్, దుండిగల్‌లో లెక్కలేవు.. అక్రమ నిర్మాణాలు సక్రమం చేసే జాబితాలో, బౌరంపేట్ షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్ అక్రమ నిర్మాణాలు కూడా చేర్చారట.. త్వరలో రేపో మాపో అనుమతులు కూడా వస్తున్నాయని, ప్రచారం జరుగుతోంది..













# రెండు కిడ్నీలు-లివర్ దెబ్బతిన్న వ్యక్తికి.. మాజీ కౌన్సిలర్ ఆర్థిక సహాయం..

- గాగిల్లాపూర్ తండా చెందిన కుటుంబానికి రూ.10 వేలు సాయం..
- దాతలు ఆదుకోవాలని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ విజ్ఞప్తి..
- గాగిల్లాపూర్ తండాకు చెందిన కాట్రోత్ లక్ష్మణ్ నాయక్‌కు తీవ్ర అస్వస్థత..
- రెండు కిడ్నీలు, లివర్ దెబ్బతిన్నట్లు తెలిపిన వైద్యులు..
- వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం..

**దుండిగల్, పెన్ పవర్, జూన్ 9:** దుండిగల్ సర్కిల్ గాగిల్లాపూర్ తండాకు చెందిన కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ తెలిపారు.. దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న లక్ష్మణ్ నాయక్ ఇటీవల అస్వస్థతకు గురికావడంతో వైద్య పరీక్షలు చేయించుకోగా, ఆయన రెండు కిడ్నీలు, లివర్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.. లక్ష్మణ్ నాయక్ కుటుంబం ప్రస్తుతం అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తోంది. ఆయనకు పెళ్లి కావాల్సిన నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి అనారోగ్యంతో మంచాన పడటంతో కుమారుడు చదువును మధ్యలోనే నిలిపివేసి ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకున్నాడు. వైద్య ఖర్చులు రోజురోజుకు పెరుగుతుండటంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది.. ఈ విషయం


ఆర్థిక సాయం చేస్తున్న మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్..

తెలుసుకున్న దుండిగల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ బుధవారం లక్ష్మణ్ నాయక్ నివాసానికి వెళ్లి ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. చిన్న ఇంట్లో నివసిస్తూ ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్న ఈ కుటుంబాన్ని మానవత్వంతో ప్రతి ఒక్కరూ

ఆదుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు..అలాగే లక్ష్మణ్ నాయక్ పరిస్థితిని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద, మాజీ మున్సిపల్ చైర్మన్ శంభీపూర్ కృష్ణ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తానని శంకర్ నాయక్ తెలిపారు..

# దుండిగల్-నాగులూరు నడుమ.. రహదారి మరమ్మతులు చేపట్టాలి..

## డీఈఈ పాప్పమ్మకు వినతిపత్రం అందజేసిన మాజీ సర్పంచ్ కావలి గణేష్..

**దుండిగల్, పెన్ పవర్, జూన్ 3:** దుండిగల్ గ్రామ నుండి నాగులూరు వెళ్ళేదారిలో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మాజీ సర్పంచ్ కావలి గణేష్ దుండిగల్ సర్కిల్ డీఈఈ పాప్పమ్మకు వినతిపత్రం అందజేశారు.. దుండిగల్ జ్యోతిరావు పూలే విగ్రహం నుండి నాగులూరు వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రహదారిపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, ముఖ్యంగా రోజువారీగా ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యానికి మరమ్మతులు చేయడానికి కావలి గణేష్ కోరారు. ప్రజల భద్రత, సౌకర్యాల దృష్ట్యా ఈ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, పండుగ శివ ముదిరాజ్ పాల్గొన్నారు..


దుండిగల్ ఇంజనీరింగ్ సెక్షన్‌లో డీఈఈకి వినతిపత్రం అందజేసిన కావలి గణేష్..

# హైదరాబాద్ కు పొంచి ఉన్న నీటి ప్రమాదం

## కేంద్ర జలశక్తి శాఖ షాకింగ్ రిపోర్ట్

**హైదరాబాద్, జూన్ 3, పెన్ పవర్, :** హైదరాబాద్ మహా నగరం తీవ్ర భూగర్భ జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్‌వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 ప్రకారం నగరంలోని మొత్తం 16 మండలాల్లో 15 మండలాలు డేంజర్ జోన్‌లో ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలైన బార్మర్, జైసల్మేర్, పంజాబ్‌లోని డార్క్ జోన్ జిల్లాలను తలపించేలా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. తక్షణమే వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ మహా నగరం ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక హబ్‌గా దూసుకుపోతుంది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరో వైపు చూస్తే నగరం భయంకరమైన జల సంక్షోభం ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర జలశక్తి శాఖ తాజాగా విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 నివేదిక ప్రకారం.. హైదరాబాద్ జిల్లాలోని మొత్తం 16 మండలాల్లో ఏకంగా 15 మండలాలు భూగర్భ జలాల లభ్యత విషయంలో అత్యంత ప్రమాదకరమైన క్రిటికల్, ఓవర్-ఎక్స్‌ప్లాయిటెడ్ కేటగిరీల్లోకి పడిపోయాయి. ఈ గణంకాలు హైదరాబాద్‌ను రాజస్థాన్‌లోని ఎడారి జిల్లాలైన జైపూర్, జోధ్‌పూర్, బికనీర్, బార్మర్, జైసల్మేర్‌ల సరసన నిలబెట్టాయి.రాజస్థాన్‌లోనే అత్యంత ఎడారి ప్రాంతమైన బార్మర్ జిల్లాలో 14 మండలాలు ప్రమాదకర స్థితిలో ఉంటే.. హైదరాబాద్‌లో అంతకంటే ఎక్కువగా 15 మండలాలు ఆ స్థితికి చేరుకున్నాయి. నగరంలోని 50 శాతం మండలాలు అతిగా వాడబడిన కేటగిరీలో, మరో 43 శాతం మండలాలు క్లిష్టమైన స్థితిలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పంజాబ్ రాష్ట్రంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయిన జలంధర్, లూథియానా వంటి డార్క్ జోన్ జిల్లాలతో హైదరాబాద్ ప్రస్తుతం సమానంగా నిలిచింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, నాంపల్లి, షేక్‌పేట్, సైదాబాద్ వంటి కీలక మండలాలు ఈ ప్రమాదకర జాబితాలో ఉన్నాయి. కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా.. పొరుగున ఉన్న రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని మరో 10 మండలాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 5 మండలాలు సైతం ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నాయి.

- నకిలీ ఐపీఎస్ అధికారిగా చలామణి అవుతున్న నాగరాజు రఘువర్మ..!
- బాధితుడిని కిడ్నాప్ చేసి రూ.6.26 లక్షలు వసూలు చేసిన ముఠా..!
- ప్రధాన నిందితుడిపై ఇప్పటికే 12 కేసులు, 2 పీడీ యాక్ట్‌లు..
- పోలీస్ డ్రెస్సులు, గన్‌లు, నకిలీ ఐడీలు సహా భారీ స్వాధీనం..
- ముగ్గురు నిందితులు అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు..



నకిలీ పోలీసుల అరెస్ట్‌లో.. డీసీపీ కోటిరెడ్డి ప్రెస్‌మీట్..

# నకిలీ 'ఐపీఎస్' అరెస్ట్.. డీసీపీ ప్రెస్‌మీట్..!

## కూకట్‌పల్లి సీసీఎస్–జగద్గిరిగుట్ట పోలీసుల జాయింట్ ఆపరేషన్.. కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి పత్రికా సమావేశం..

### నాగరాజుపై పలు క్రిమినల్ కేసులు, పీడీ యాక్ట్‌లు..

నిందితుడు నాగరాజుపై ఇప్పటికే 12 క్రిమినల్ కేసులు, రెండు పీడీ యాక్ట్‌లు ఉండటం తోపాటు భీమవరంలో రౌడీషీట్ కూడా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది.. ప్రతి ఆపరేషన్‌కు ఒక్కో పేరు ఉపయోగిస్తూ మొత్తం 12 నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేసుకుని చలామణి అయినట్లు పోలీసులు తెలిపారు.. నిందితుల వద్ద నుంచి రెండు గన్‌లు (ఎయిర్ పిస్టల్, కంట్రీమేడ్ పిస్టల్), పోలీస్ యూనిఫామ్‌లు, ల్యాప్‌టాప్, కారు, బైక్, లెటర్‌ప్యాడ్లు, బేడీలు, రబ్బర్ స్టాంపులు, 10 మొబైల్ ఫోన్లు, వివిధ హోదాలకు సంబంధించిన స్టార్ సింబల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.









**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూన్ 3:** అధికారుల కళ్లు గప్పి పోలీసులుగా చలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్న నకిలీ పోలీస్ ముఠాను కూకట్‌పల్లి సీసీఎస్, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గతంలో ఆర్మీ కల్నల్ అవతారం ఎత్తి అరెస్ట్ అయిన కేసులో రెండు పీడీ యాక్ట్‌లు ఎదుర్కొన్న నాగరాజు రఘువర్మ, ఈసారి ఐపీఎస్ అధికారిగా అవతారమెత్తి, ప్రజలను మోసం చేస్తున్న సమయంలో పోలీసులకు చిక్కాడు.. గతనెల (మే18న) కూకట్‌పల్లికి చెందిన పూర్ణచందర్‌రావు (42)ను హర్యానాలో నమోదైన కేసు పేరుతో బెదిరించి, తాను ఐపీఎస్ అధికారినని నమ్మించిన నాగరాజు తన అనుచరులతో కలిసి కిడ్నాప్ చేసినట్లు విచారణలో తేలింది. నకిలీ పోలీస్ కారులో బాధితుడిని సూర్యాపేటకు తీసుకెళ్లి రూ.1 లక్ష వసూలు చేయడం తోపాటు, ఆతర్వాత మరోసారి రూ.5.26 లక్షలు దోచుకుని పరారైనట్లు పోలీసులు వెల్లడించారు.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అంబీస్ టెక్నాలజీ (అడ్వాన్స్‌డ్ మల్టీ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్) సహకారంతో నిందితుల జాడను గుర్తించేందుకు పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు..ప్రధాన నిందితుడు నాగరాజు తోపాటు ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు..



# స్కిల్ డెవలప్మెంట్ పై తెలంగాణ - జర్మనీ మధ్య ఒప్పందం.. అగ్రిమెంట్ చేసుకున్న మంత్రి వివేక్...

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ( జూన్ 3 ) ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సీఎం రేవంత్ మాట్లాడుతూ..**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ..**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర

యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు.

**సెమీకండక్టర్ రంగంలో కొత్త అవకాశాలు**

తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపె నీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు.

**తెలంగాణ ప్రగతికి జర్మనీ కితాబు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు.

ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన "తెలంగాణ రైజింగ్ - 2047" విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత–జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

## దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుండి దూకి యువతి ఆత్మహత్య

**హైదరాబాద్: పెన్ పవర్:** దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్య చేసుకుంది. తమ కూతురు రోజా రమణి(26) కనిపించడంలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. నాగోల్ ప్రాంతంలో నివసిస్తూ మృతురాలు మెడికవర్ ఆసుపత్రిలో అకౌంటెంట్గా పని చేస్తుంది. లోన్ రికవరీ ఏజెంట్స్ వేదింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల అనుమానం.

## పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే... అమల్లోకి వచ్చిన సీఈపీఏ

**న్యూఢిల్లీ, జూన్ 3, పెన్ పవర్:** అమెరికా--ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటంతో భారత్కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.భారత్--ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఒమన్లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్కు చమురు, ఎల్ఎన్జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోందిఒమన్తో ఒప్పందం కారణంగా హోర్ముజ్పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది.ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హోర్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య -- ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్ దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం.

## బాలీవుడ్ డైరక్టర్స్ ను దాటేస్తున్న టాలీవుడ్ డైరక్టర్స్...

**హైదరాబాద్, జూన్ 3: పెన్ పవర్:** బాహుబలి సినిమా ఎప్పుడైతే వచ్చిందో అప్పటినుంచి తెలుగు సినిమాల హవా ఇండియా వైడ్ గా కొనసాగుతుంది. ఇప్పటికే మన దర్శకులు భారీ పాపులారిటిని సంపాదించుకున్నారు. ఒకప్పుడు ఇండియాలో స్టార్ డైరెక్టర్లు ఎవరు అంటే బాలీవుడ్ దర్శకుల పేర్లు చెప్పారు. కానీ ఆయా దర్శకులకు ఒక్కొక్కరికి మన ఒక్కొక్క దర్శకుడు చెక్ పెడుతూ వచ్చాడు. ముఖ్యంగా రాజ్ కుమార్ హిరానీ లాంటి స్టార్ డైరెక్టర్ కి వరుస సక్సెస్ లను సాధిస్తూ తనకెదురుగా ఎవరు లేరు అనేంతలా పేరును సంపాదించుకున్నాడు. కానీ అతనికి రాజమౌళి బాహుబలి సినిమాతో చెక్ పెట్టాడు. ఇక బాహుబలి 2 సినిమాతో బాలీవుడ్ దర్శకులందరిని ఒకేసారి పక్కన పెట్టేసిన రాజమౌళి ఇండియాలో నెంబర్ వన్ డైరెక్టర్ గా మారాడు...కమర్షియల్ సినిమాలతో సక్సెస్ ను సాధించే రోహిత్ శెట్టికి సుకుమార్ చెక్ పెట్టాడు. 'పుష్ప 2' సినిమాతో 1850 కోట్లకు పైన కలెక్షన్స్ ను రాబట్టి తెలుగు దర్శకులు కమర్షియల్ సినిమాలు చేస్తే ఎలా ఉంటుందో వాళ్లందరికి చూపించాడు...ఇక బాలీవుడ్ హీరో తోనే అనిమల్ సినిమా చేసి ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా...ఆయన సైతం బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అయిన సంజయ్ లీలా భన్సాలీ కి చెక్ పెట్టాడు... ఇక నాగ్ అశ్విన్ లాంటి దర్శకుడు సైతం ఇండస్ట్రీలో ఉన్న మిగతా దర్శకులందరికి చెక్ పెట్టాడు. ఇలా మన దర్శకుల హవా కొనసాగడమే కాకుండా బాలీవుడ్ దర్శకులను సైతం డామినేట్ చేస్తూ మనవాళ్ళు ముందుకు దూసుకెళ్లడం అనేది నిజంగా ప్రతి ఒక్కరిని ఆనందానికి గురిచేస్తుంది.ఇక అలాంటి దర్శకులు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి మరింత మంది రావాలని బాలీవుడ్ ఇండస్ట్రీ షేక్ అయ్యేలా మనవాళ్లు సినిమా చేయాలని బాలీవుడ్ హీరోలు సైతం మనవాళ్ళతో సినిమాలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు.ఇక మొత్తానికైతే తెలుగు సినిమా ఇండస్ట్రీ ఇప్పుడు టాప్ పొజిషన్లో కొనసాగడమే కాకుండా ఇండియన్ సినిమా ఇండస్ట్రీ ని శాసించే స్థాయికి వెళ్ళిపోయింది... ఇప్పటికే సల్మాన్ ఖాన్ లాంటి స్టార్ హీరో సైతం మన తెలుగు దర్శకుడైన వంశీ పైడిపల్లి తో సినిమా చేస్తున్నాడు. అమీర్ ఖాన్ సైతం తెలుగు దర్శకుల మీద ఎక్కువగా ఫోకస్ చేస్తున్నాడు. కానీ అతనితో సినిమా చేయడానికి పెద్దగా ఎవరు ఇంట్రెస్ట్ ని చూపించడం లేదు...

## పోలీసు కస్టడిలో సుబోధ్ సింగ్

**కరీంనగర్: పెన్ పవర్:** మోస్ట్ వాంటెడ్ దొంగ సుబోధ్ సింగ్ ను పోలీసులు కస్టడిలోకి తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపినపీఎంజే జెవెల్లర్స్ దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన సూత్రధారి. నిందితుడిని పోలీసులు బీహార్ పాట్నా జైలు నుండి పిటి వారెంట్ పై కరీంనగర్ తీసుకువచ్చారు. సుబోధ్ సింగ్ తో పాటుగా మరో ముగ్గురు దొంగలను కస్టడీ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జైలు వద్ద భారీ పోలీస్ భద్రత కల్పించారు.

## హరీశ్ రావు జన్మదినోత్సవం సందర్భంగా పాటల సీడీ ఆవిష్కరణ

**సంగారెడ్డి: పెన్ పవర్:** బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యువ నాయకుడు వికాస్ రూపొందించిన ప్రత్యేక పాటల సీడీని మాజీ మంత్రి హరీశ్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, హరీశ్ రావు నాయకత్వం తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో హరీశ్ రావు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, నిబద్ధత రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు హరీశ్ రావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుడిగా హరీశ్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.

## తుమ్మిడిహట్టి అనేది రేవంత్ రెడ్డి డైవర్షన్ గేమ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తుమ్మిడిహట్టి అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ గేమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్పుడు అతను కూర్చుంటున్న ఆఫీసులోనే గతంలో మహారాష్ట్ర ప్రభుత్వాలు తుమ్మిడిహట్టి ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తుకు పెంచడానికి ఒప్పుకోము అని రాసిన లేఖలు ఉన్నాయని అన్నారు.

బుధవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు ఒప్పించలేకపోయారు. అంత పట్టుదల ఉంటే పోయి మహారాష్ట్ర సీఎం ఇంటి ముందు నిరహార దీక్ష చేయండని కేటీఆర్ సలహా ఇచ్చారు.

ఏప ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యాలపై కేటీఆర్ స్యపందించారు. దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ పాఠాలు చెప్పాల్సిన పనిలేదు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు కదం తొక్కిన నేల తెలంగాణ అని అన్నారు. సోదరుడిగా వస్తే ఇంటికి పిలిచి హైదరాబాద్ బిర్యానీ పెడతా. కానీ, సెక్రటేరియట్ లో కూర్చుని పెత్తనం చేస్తామంటే ఒప్పుకోమని అన్నారు.

# 9 జిల్లాల్లో మహిళా శక్తి బజార్లు

**ఖమ్మం, జూన్ 3, పెన్ పవర్:**
తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా సూపర్ బజార్లు, లాజిస్టిక్స్ హబ్లు, ఆధునిక రైస్మిల్లులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ వేగంగా అడుగులు వేస్తోంది. మహిళా సంఘాల ద్వారానే వీటిని సమర్ధవంతంగా నిర్వహించి, వారిని వ్యాపారవేత్తలుగా మార్చాలనేది ప్రభుత్వ ప్రధాన సంకల్పంఈ బృహత్తర ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తొలి దశ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి కాకుండా.. ప్రాథమికంగా తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాలైన హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్నగర్, సంగారెడ్డిలలో ఒక్కొక్కటి చొప్పున మహిళా శక్తి సూపర్ బజార్లను స్థాపించాలని ప్రతిపాదించారు. ప్రముఖ రిటైల్ సంస్థ డీమార్ట్ తరహాలోనే ఈ సూపర్ బజార్లలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, వివిధ రకాల పరికరాలను తక్కువ ధరలకే విక్రయించేలా ఖమ్మంలో మొదటి పైలట్ ప్రాజెక్ట్ను ప్రారంభించనున్నారుఈ సూపర్ బజార్ల నిర్మాణానికి జనాభా సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సుమారు 5 వేల గజాల స్థలం అవసరమని సెర్ప్ అధికారులు గుర్తించారు. అనువైన ప్రభుత్వ భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయా జిల్లాల కలెక్టర్లకు తక్షణమే లేఖలు రాయాలని నిర్ణయించారు. మరోవైపు.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో లాజిస్టిక్స్ హబ్, రైస్మిల్లు ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సెంటిమెంటే...ఆయింట్ మెంట్ ఆత్మగౌరవ నినాదంతో అడుగులు

**హైదరాబాద్, జూన్ 3, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. పదేళ్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే పరిపాలన, అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందనుకుంటున్న తరుణంలో, మళ్ళీ ఆంధ్ర-తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న సెంటిమెంట్ రాజకీయాల వెనుక ప్రధానంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలకంగా కనిపిస్తున్నాయి. గతంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలను తెరపైకి తెచ్చి ప్రజల్లో సెంటిమెంట్ను రగిల్చేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే, ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టార్గెట్ గా జరుగుతున్న రాజకీయం, పవన్ కూడా తెలంగాణపై దృష్టి సారించడం, మంగళవారం జరిగిన సమావేశం పరిణామాలను ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కొత్త ఉద్యమాన్ని లేవనెత్తాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తద్వారా కోల్పోయిన రాజకీయ ఉనికిని మళ్ళీ చాటుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం.కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ సెంటిమెంట్ వేడి కనిపిస్తోంది. అనిరుధ్ రెడ్డి, మందుల సామ్యూల్ వంటి నేతలు ఏపీ నేతలను టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ లైన్కు భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వీరు కూడా ప్రాంతీయ నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్ మళ్ళీ బలపడితే, ఆ సెంటిమెంట్కు పేటెంట్ హక్కు కలిగిన బీఆర్ఎస్కే అంతిమంగా లాభం చేకూరుతుందని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆయన భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన పరిపాలనకే మొగ్గు చూపుతున్నారు.రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ను కాదని కాంగ్రెస్ను ఎన్నుకున్నది కేవలం సెంటిమెంట్ కోసం కాదు, మార్పు , పరిపాలన కోసం. ఇప్పుడు మళ్ళీ అదే సెంటిమెంట్ ఉచ్చులో పడితే, కాంగ్రెస్ తన అభివృద్ధి అజెండాను పక్కన పెట్టాల్సి వస్తుంది. పైగా, ఏపీతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. కానీ, తన సొంత పార్టీ నేతలు కొందరు కంట్రోల్ కాకుండా ఏపీపై విమర్శలు చేయడం ఆయనకు తలనొప్పిగా మారింది. రేవంత్ రెడ్డి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి డ్యూయల్ స్ట్రాటజీ అమలు చేసే అవకాశం ఉంది. ఒకటి, పార్టీ నేతలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఏపీ నేతలపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవడం. రెండు, బీఆర్ఎస్ చేస్తున్న సెంటిమెంట్ ప్రచారాన్ని రాజకీయ డైవర్షన్ గా ప్రజల్లోకి తీసుకెళ్లడం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు సెంటిమెంట్ పేరుతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని ఆయన వాదించనున్నారు.పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఈ సమీకరణాల్లో కీలకం. పవన్ను టార్గెట్ చేయడం ద్వారా సెంటిమెంట్ను పెంచాలని బీఆర్ఎస్ చూస్తుంటే, రేవంత్ మాత్రం దాన్ని కేవలం ఒక పొరుగు రాష్ట్ర నేత పర్యటనగా మాత్రమే పరిగణించాలనే ధోరణిలో ఉన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయాలు అనేవి ఒక డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటివి. రేవంత్ రెడ్డి ఈ సెంటిమెంట్ వేవ్ ను సమర్థవంతంగా అడ్డుకోగలిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. ఒకవేళ తన పార్టీ నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమైతే, అది బీఆర్ఎస్కు ఆక్సిజన్ అందించినట్లు అవుతుంది.

# హోమ్ మంత్రిగా స్పీకర్...?

**హైదరాబాద్, జూన్ 3, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో, ఎట్టకేలకు కేబినెట్ విస్తరణ, పునర్వ్యవస్థీకరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వచ్చేవారంలోనే ఈ ప్రక్రియ పూర్తి కావచ్చని గాంధీభవన్ వర్గాల నుంచి బలమైన సంకేతాలు అందుతున్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి సహా 16 మంది మంత్రులు ఉండగా, మరో రెండు ఖాళీలు ఉన్నాయి. అయితే కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, కొందరు మంత్రుల శాఖలను మార్చడం, పనితీరు ఆధారంగా ఒకరిద్దరిని పక్కన పెట్టే అవకాశాలు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈసారి కేబినెట్ విస్తరణలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధానాంశం.. ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రివర్గంలోకి రానుండటం. గత వారం ఆయన ఉన్నట్టుండి ఢిల్లీ పర్యటనకు వెళ్లడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందనే చర్చ నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పక్కా స్క్రిప్ట్ మేరకు ప్రసాద్ కుమార్ హస్తినకు వెళ్లి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారని పార్టీ వర్గాల మాట. తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరగా, రాహుల్ గాంధీ నుంచి సానుకూలత వ్యక్తమైనట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే ఉన్న కీలకమైన హోం శాఖను గడ్డం ప్రసాద్కు అప్పగించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. స్పీకర్ పదవి లాంటి ఉన్నత స్థానం నుంచి తక్కువ ప్రాధాన్యత ఉన్న శాఖకు మారిస్తే విమర్శలు వస్తాయని, అందుకే హోం శాఖ ఇవ్వడమే సరైన నిర్ణయమని ఏఐసీసీ భావిస్తోంది.తొలి విడత కేబినెట్ కూర్పులో ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ వంటి జిల్లాలకు ప్రాతినిధ్యం లభించలేదు. ఈ నేపథ్యంలో ఈసారి ఆయా జిల్లాలకు పెద్దపీట వేయనున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవిని గట్టిగా ఆశిస్తున్నారు. అయితే, ఇప్పటికే కేబినెట్లో రెడ్ల ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే విమర్శలు ఉండటంతో, అదే జిల్లాకు చెందిన ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ను తీసుకోవడం వల్ల సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ల విశ్లేషణ.మరోవైపు నల్గొండ జిల్లా నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి రేసులో ముందంజలో ఉన్నారు. వీరితో పాటు ఉమ్మడి నిజామాబాద్ నుంచి సీనియర్ నేత పి. సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ నుంచి ప్రేమ్‌సాగర్ రావు, బీసీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి మరికొందరు ఆశావహులు ఏఐసీసీ పెద్దల తలుపు తడుతున్నారు.ఇప్పటికే ఉన్న కొందరు మంత్రుల శాఖల మార్పుపై కూడా రేవంత్ రెడ్డి కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. జూన్ రెండో వారంలో ఏఐసీసీ అధిష్టానం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో తుది సమావేశం నిర్వహించి జాబితాను ఖరారు చేయనుంది

# గ్రామాల్లో ఇంటర్ నెట్ స్పీడ్ కోసం నయా కార్పొరేషన్

**హైదరాబాద్, జూన్ 3, పెన్ పవర్:**
తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ అమెండెడ్ భారత్ నెట్ పథకం కింద కేంద్ర, రాష్ట్రాల సమాన భాగస్వామ్యంతో ఇది పనిచేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు కేంద్రం కార్పొరేషన్ నిర్వహణ కోసం పదేళ్లకు రూ.2600 కోట్లు అలాగే తొలి విడతగా 3 లక్షల గ్రామీణ కనెక్షన్ల కోసం రూ.300 కోట్లు మంజూరు చేసింది.తెలంగాణలోని పల్లెపల్లెకూ హైస్పీడ్ డిజిటల్ నెట్‌వర్క్ను అనుసంధానం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమెండెడ్ భారత్ నెట్ పథకంలో భాగంగా.. తెలంగాణ రూరల్ ఇంటర్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (౮=××జూ)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో ఈ నూతన సంస్థ పనిచేయనుంది.ఈ కొత్త కార్పొరేషన్ బోర్డులో ఇరుపక్షాలకూ సమాన ప్రాధాన్యత కల్పించారు. బోర్డు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక సీఈవోతో పాటు ఐటీ, ఆర్థిక, పంచాయతీరాజ్, ఇంధన శాఖల ఉన్నతాధికారులు నలుగురు డైరెక్టర్లుగా

వ్యవహరిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తరపున ఎక్స్ అఫీషియో ఛైర్మన్తో పాటు మరో నలుగురు డైరెక్టర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో సేవలందిస్తున్న తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కొత్త కార్పొరేషన్కు కూడా సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారుతెలంగాణకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా కొత్త కార్పొరేషన్ ఏర్పాటు నిబంధనల్లో కొన్ని కీలక వెసులుబాట్లు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భారీ నిధులను ఆమోదించింది. కార్పొరేషన్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర సాంకేతిక అవసరాల కోసం ఏటా రూ.260 కోట్ల చొప్పున.. రాబోయే పదేళ్ల కాలానికి గానూ మొత్తం రూ.2600 కోట్ల భారీ నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దీంతో పాటు భారత్ నెట్ ఉద్యమీ ప్రోగామ్ కింద తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత వేగవంతం చేసేందుకు

కేంద్రం ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి విడతలోనే రాష్ట్రంలోని పల్లెటూళ్లలో 3 లక్షల గృహాలకు ఉచిత ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.10వేల చొప్పున మొత్తం రూ.300 కోట్లను కేంద్రం భరించనుంది. గతంలో నిర్మించిన భారత్ నెట్ ఫేజ్-1, 2 నెట్‌వర్క్లను అత్యాధునికంగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఇప్పటివరకు కనెక్టివిటీ లేని మారుమూల గ్రామాలకు ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఉన్న టీ-ఫైబర్ జిల్లా, మండల కేంద్రాల వరకే నెట్‌వర్క్ను నిర్వహిస్తుండగా.. కొత్తగా ఏర్పాటైన టీఆర్ఐఐసీఎల్ మండల కేంద్రాల నుండి చివరి గ్రామ స్థాయి వరకు ఇంటర్నెట్ నెట్‌వర్క్ను తీసుకెళ్లి దాని నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించనుంది.

# పంచాయితీల తర్వాతే మున్సిపాల్టీలు

**విశాఖపట్టణం, జూన్ 3, పెన్ పవర్:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. పంచాయితీతోపాటు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పంచాయతీల పాలకవర్గం ముగిసింది. కొత్తగా ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. మున్సిపాలిటీలకు సైతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా వచ్చారు. అయితే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని కూటమి భావిస్తోంది. ఎన్నికల నిర్వహణకు ఇదే సమయం అని అంచనా వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం స్థానిక ఎన్నికలకు సిద్ధపడుతోంది. ప్రతిచోట వైసీపీ అభ్యర్థి బరిలో ఉండాల్సిందేనని.. లేకుంటే మాత్రం వైసిపి ఇన్చార్జ్ పై వేటు వేస్తామని జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మరోవైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నారు.కూటమి ప్రభుత్వపరంగా ఈనెల కీలకం. ముఖ్యంగా ఇదే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల భరోసా వంటి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో ప్రజల్లో సంతృప్తి శాతం పెరుగుతుందని అంచనా వేస్తోంది. మరోవైపు కొత్త పింఛన్లకు సంబంధించిన బిగ్ అప్డేట్ వచ్చింది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరు చేసి.. ప్రజల్లో మరింత సంతృప్తి సాధించి.. ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో కూటమి ఉంది. అయితే జూలై నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలు ఉన్నాయి. వీటికి ఏప్రిల్ నాలుగు తో పదవీకాలం గడువు ముగిసింది. అప్పటినుంచి ప్రత్యేక అధికారులను నియమించారు. మరోవైపు ఏప్రిల్ నుంచి 16వ ఆర్థిక సంఘం గడువు ప్రారంభం అయింది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు దక్కేవి. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వీలైనంతవరకు పంచాయితీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేసే అవకాశం కనిపిస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకోవద్దు అని జగన్మోహన్ రెడ్డి గట్టిగానే చెప్పారు. అయితే క్యాడర్ మాత్రం విముఖత వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎన్నికలు అంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. పైగా ఆర్థిక భారం తప్పేలా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి చూస్తుంటే తప్పనిసరిగా బరిలో ఉండాల్సిందేనని చెబుతున్నారు. కానీ పార్టీ శ్రేణులు మాత్రం పులివెందుల జడ్పిటిసి ఎన్నికలను గుర్తుచేసుకొని భయపడుతున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 110 కి పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. పట్టణాలతో పాటు నగరాల్లో కూటమికి సంతృప్తికర వాతావరణముంది. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుండడంతో అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కూడా కూటమి సత్తా చాటాలని చూస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలు కాకుండా పోటీ చేయించాలన్న ఆలోచనలో వైసిపి ఉంది. కానీ వైసీపీ క్యాడర్ మాత్రం అందుకు సుముఖంగా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి పట్టుబడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేయాల్సి ఉంటుంది.

**పార్టీ కోసం కష్టపడిన వారికే టికెట్లు..!**

ఇటు పార్టీ అగ్రనేతల కామెంట్స్..మరోవైపు ఎస్ఈసీ డెవలప్‌మెంట్స్‌తో..ఏపీలో స్థానిక ఎన్నికల సందడి ఊపందుకుంటోంది. ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో టీడీపీ ఈ ఎలక్షన్స్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గెలుచుకున్న స్థానాలను తిరిగి కైవసం చేసుకుని పసుపు జెండా రెపరెపలాడించాలని పట్టుదలతో ఉంది. మహానాడు వేదికపైనా స్థానిక ఎన్నికలపై చర్చ జరిగింది. పార్టీ జెండా మోసిన వారికి పోటీ అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు వెళ్లాయంటున్నారు.పార్టీ కోసం కష్టపడిన వారికి కచ్చితంగా టికెట్లు ఇస్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని సంకేతాలిచ్చారాయన. ఇక ఇదే సందర్భంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా స్థానిక ఎన్నికలపై గురిపెట్టారు. ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, ప్రతి స్థానంలోనూ పోటీ ఉండేలా అభ్యర్థులను ఇప్పటినుంచే రెడీ చేయాలని లీడర్లకు సూచించారు. దీంతో ఒక్కసారిగా ఏపీలో పొలిటికల్ హీట్ కాక రేక రేపుతోంది.స్థానిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీల మధ్యే గట్టి పోటీ ఉండే పరిస్థితి కనిపిస్తోంది. కూటమిలో జనసేన, బీజేపీకి సీట్లు కేటాయించిన చోట..పరిస్థితులు తమకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ భావిస్తోంది. 2021-22లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం స్థానాలను సొంతం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో 100 శాతం స్థానాలను గెలుచుకోవాలని టీడీపీ యోచిస్తోంది. వైసీపీపై రాజకీయ ప్రతీకారం తీర్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన కూడా కీలక స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉంది. ఆయా జిల్లాల నుంచి ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కీలకమైన వార్డులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.మరోవైపు బీజేపీ కూడా తమకు బలం ఉన్నచోట అభ్యర్థులను పోటీలోకి దించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఎన్నికలకు దూరంగా ఉండాలా..లేక పోటీ చేయాలా అనే డైలామాలో ఉన్న వైసీపీ ఇక అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయినట్లు కనిపిస్తోంది. అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఫ్యాన్ పార్టీ..స్థానిక ఎన్నికల్లో గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు సర్వం సిద్ధం చేస్తోందట. రాష్ట్రస్థాయి కీలక నేతల సమావేశంలో స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు జగన్. ముఖ్యంగా ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, అలా జరిగితే నియోజకవర్గ ఇంచార్జ్‌ల ఫెయిల్యూర్‌గా భావించాల్సి వస్తుందని ముఖ్యనేతలను హెచ్చరించారు. దీంతో స్థానిక పోరు విషయంలో తగ్గేదేలే అన్న ఇండికేషన్ పంపించారు వైసీపీ అధినేత జగన్.ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దాదాపు 13 వేల 326 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి న్యాయపరమైన చిక్కుల కారణంగా గతంలో ఎన్నికలు నిర్వహించ లేదు. ఇప్పుడు అన్ని పంచాయతీలకు ఎలక్షన్స్ జరిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే 660 జడ్పీటీసీ స్థానాలు, 10వేల 47కి పైగా ఎంపీటీసీ స్థానాలకు ఎలక్షన్స్ పెట్టనుండటంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. అలాగే రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రకారం 920కు వార్డుల సంఖ్య పెరిగింది. 75 మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 2 వేలకు పైగా వార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ కూడా రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు స్టేట్ ఈసీ కసరత్తు చేస్తోంది.

# టార్గెట్ 100 జగన నయా లెక్కలు



**విజయవాడ, జూన్ 3, పెన్ పవర్:** రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మారడం సహజం. అయితే భారీ విజయాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లిన పార్టీలు అనూహ్య ఫలితాలు ఎదుర్కొన్నప్పుడు తమ కార్యాచరణను తిరిగి సమీక్షించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా ఇలాంటి చర్చలే జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల సమయంలో వై నాట్ 175 అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసిన పార్టీ, ఎన్నికల ఫలితాల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడంతో భవిష్యత్ వ్యూహాలపై అంతర్గతంగా మంతనాలు ప్రారంభమైనట్లు సమాచారం.ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశాల్లో నాయకుల మధ్య కొత్త ఎన్నికల లక్ష్యాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో అత్యంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిమిత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచనలు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొంతమంది నాయకులు 175 స్థానాలపై దృష్టి కేంద్రీకరించడం కంటే, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న సుమారు 100 నియోజకవర్గాలను గుర్తించి ప్రత్యేక వ్యూహంతో పని చేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. బలమైన స్థానాల్లో పార్టీ శక్తిని కేంద్రీకరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని వారు వివరించినట్లు తెలుస్తోంది.అలాగే ఆయా నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వాన్ని మరింత చురుకుగా మార్చడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. గతఎన్నికల అనుభవాల ఆధారంగా బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్ తుది నిర్ణయం తీసుకునేవరకు ఈ అంశంపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.ఇక పార్టీ సీనియర్ నేతసజ్జల రామకృష్ణ రెడ్డిసమావేశంలో లక్ష్యాల సంఖ్యను తగ్గించుకోవడంపై కాకుండా గెలుపు అవకాశాలను పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల మద్దతు, సమర్థవంతమైన ప్రచారం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం.మరోవైపు రానున్న కాలంలో నిర్వహించే ప్రజా కార్యక్రమాలు, ముఖ్యంగా పార్టీ అధినేత చేపట్టనున్న పాదయాత్ర తర్వాత రాజకీయ పరిస్థితులను అంచనా వేసి తుది వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకు అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం. ఎన్నికల లక్ష్యాల కంటే ప్రజల్లో మళ్లీ విశ్వాసాన్ని పెంపొందించుకోవడంపైనే ప్రస్తుతం పార్టీ ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# కమలానికి ఏమైంది...

**నెల్లూరు, జూన్ 3,పెన్ పవర్:** ఏపీలో బిజెపి ప్రక్షాళన దిశగా హై కమాండ్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ నేతల వ్యవహార శైలిపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అభివృద్ధిపై నేతలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పార్టీని బలోపేతం చేయడం లేదు. దీనిపై హై కమాండ్ కు స్పష్టమైన సమాచారం ఉంది. అందుకే నేతల తీరుపై పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన నేతను పిలిచి గట్టిగానే క్లాసు పీకినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ఎదుట నేతల పనితీరు, వ్యవహార శైలి బయట పెట్టినట్లు సమాచారం. అందుకే మొత్తం మార్పు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది.ఏపీలో భారతీయ జనతా పార్టీ కనీసం సొంతంగా ఉనికి చాటుకునే పరిస్థితిలో లేదు. తెలుగుదేశం పార్టీతో కలిసిన సమయంలో మాత్రమే ఓట్లతో పాటు సీట్లు పెరుగుతున్నాయి. ఒంటరిగా పోరాటం చేస్తున్న ప్రతిసారి ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్లు రావడం లేదు. 2014లో టిడిపి తో కలిసి పోటీ చేస్తే ఎమ్మెల్యే తో పాటు ఎంపీ స్థానాలను దక్కించుకుంది బిజెపి. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎనిమిది ఎమ్మెల్యేలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు ఆ పార్టీకి దక్కాయి. అయితే ఇప్పుడు కూడా ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పార్టీ కోసం పట్టించుకునే వారు కరువవుతున్నారుబిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పివిఎన్ మాధవ్ పార్టీని అభివృద్ధి చేస్తారని హైకమాండ్‌భావించింది. ఆయనపై చాలా రకాలుగా అంచనాలు పెట్టుకుంది. కానీ ఎందుకో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రారంభంలో హడావిడి చేశారు. తరువాత ప్రెస్ మీట్ లకే పరిమితం అవుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఉన్నాయి. పార్టీకి పెద్దదిక్కుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయనకు ఢిల్లీలో పరపతి ఉంది. సీఎం చంద్రబాబు వద్ద గౌరవం ఉంది. అందుకే ఆయన కేంద్ర ప్రభుత్వపరంగా, రాష్ట్ర ప్రభుత్వపరంగా పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శ ఉంది. దగ్గుబాటి పురందేశ్వరి పరిస్థితి కూడా అదే. మొన్నటి ఎన్నికల వరకు ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండేవారు. ఇప్పుడు రాజమండ్రి ఎంపీగా కూడా ఉన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఆమె తరుపున కూడా ఎవరు లేకుండా పోయారు పార్లమెంట్ నియోజకవర్గంలో. ఇవన్నీ పార్టీ దృష్టికి వెళ్లాయి కూడా.. అందుకే హై కమాండ్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మూడు పార్టీలు కలిసి వెళ్తాయి. కానీ క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీకి బలం లేదు. ఆ బలం పెంచుకునే ప్రయత్నం కూడా జరగలేదు. జిల్లా కమిటీలు ఉన్నాయంటే ఉన్నాయి. కనీసం గ్రామస్థాయి కమిటీలు లేవు. మండల కమిటీలు కానరావు. నియోజకవర్గాలు ఇన్చార్జులు ఉన్న ఫలితం లేదు. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఇతర రాష్ట్రాల్లో బూత్ లెవెల్ లో బలమైన కమిటీలు ఉంటాయి. కానీ ఏపీ విషయానికి వచ్చినప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఇలానే కొనసాగితే ఏపీ బీజేపీలో ప్రక్షాళనకు హైకమాండ్ ప్రయత్నించే అవకాశం ఉంది. కచ్చితంగాచాలా రకాల మార్పులకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# మాకో అవకాశం ఇవ్వండి

**విజయవాడ, జూన్ 3, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో సీనియర్ నేతలు ఎక్కువ మంది ఈ పదవిని ఆశిస్తున్నారు. కానీ పదవులు తక్కువ.. ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఇది టీడీపీ నాయకత్వానికి కొంత ఇబ్బందిగా మారే అవకాశముంది. తాము పార్టీ కోసం పడిన కష్టాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ ను కలిసి తమ వినతులను సమర్పించారు. తమకు పెద్దల సభలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ నాయకత్వం మాత్రం రాజ్యసభ స్థానాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి వచ్చింది.వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్ రావు వంటి నేతలు తమకు రాజ్యసభ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా కీలక కామెంట్స్ చేశారు. తన తర్వాత తన కుటుంబానికి కూడా రాజకీయంగా సేవ చేసే అవకాశం ఇవ్వాలని అయ్యన్న పాత్రుడు కోరారు. ఇరవై ఐదేళ్ల వయస్సు నుంచి టీడీపీలో సేవలందిస్తున్నానన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తన కుటుంబానికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. అంటే పరోక్షంగా తన కుమారుడు చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపాలని కోరినట్లు నాయకత్వానికి చెప్పకనే చెప్పినట్లయింది.తెలుగుదేశం పార్టీ కోసం జీవితాంతం పనిచేశానని అయ్యన్న పాత్రుడు భావోద్వేగంగా మాట్లాడారు. తన కుటుంబ సభ్యులకు కూడా పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరిన స్పీకర్ అయ్యన్న అందుకు అవకాశమివ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సమయంలో అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీలో రాజ్యసభ ఆశావహుల మధ్య అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మరి రాజ్యసభకు టీడీపీ నాయకత్వం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది మాత్రం చివరి వరకూ సస్పెన్స్ గా కొనసాగే అవకాశముంది.

# టీడీపికి కలిసి రాని రాజ్యసభ

**విజయవాడ, జూన్ 3, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల సందడి ఊపందుకుంది. రాష్ట్రంలో కూటమికి ఉన్న భారీ మెజారిటీ కారణంగా ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలనూ కైవసం చేసుకోవడం నల్లేరుపై నడకే. అయితే,

ఈ విజయోత్సాహం నడుమ పార్టీలో ఒక ఆసక్తికరమైన, పాత వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. 1984 లో ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు పెద్దల సభకు వెళ్లిన నేతల చరిత్రను గమనిస్తే.. రాజ్యసభ సభ్యులు టీడీపీకి ఎప్పుడూ కలిసి రాలేదు అనే సెంటిమెంట్ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు దాదాపు 46 మంది నేతలు ఆ పార్టీ తరఫున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ సుదీర్ఘ చరిత్రలో ఒక చేదు నిజం పార్టీని నిరంతరం వెంటాడుతోంది. టీడీపీ తరఫున ఒకసారి కంటే ఎక్కువసార్లు రాజ్యసభకు వెళ్లిన నేతలలో అత్యధికులు కీలక సమయంలో పార్టీకి హ్యాండ్ ఇచ్చి వలస బాట పట్టారు. నాడు ఎన్టీఆర్ హయాంలో పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పిన పి. ఉపేంద్ర కాలం నుంచి.. నిన్నమొన్నటి సుజనా చౌదరి, సీఎం రమేష్ వరకు ఈ జాబితా చాలా పెద్దదిగానే ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవాల్సిన ఈ పెద్దలు .. సొంత ప్రయోజనాల కోసం లేదా కేసుల భయంతో పార్టీ లైన్ దాటడం ప్రతిసారీ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.టీడీపీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకున్న 2019 ఎన్నికల తర్వాత ఈ రాజ్యసభ సభ్యుల వలసలు పరాకాష్టకు చేరాయి. అప్పట్లో టీడీపీకి ఉన్న ఆరుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు సుజనా చౌదరి, సి.ఎం. రమేష్, టి.జి. వెంకటేష్, గరికపాటి మోహన్ రావు ఒకేసారి గ్రూప్‌గా మారి, రాజ్యసభలో టీడీపీ పక్షాన్ని ఏకంగా బీజేపీలో విలీనం చేసేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం రెండు పైగా మూడు వంతుల మెజారిటీని వాడుకుని, అనర్హత వేటు పడకుండా వీరు సేఫ్‌గా కమలం గూటికి చేరిపోయారు. అంతకుముందు చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తులుగా, ఢిల్లీలో పార్టీ ముఖచిత్రాలుగా వెలిగిన వీరే.. పార్టీ ఓడిపోగానే పక్కదారి పట్టడం చంద్రబాబు రాజకీయ వ్యూహాల లోపాన్ని ఎత్తిచూపింది.ఈ వరుస వలసల వెనుక ఉన్న అసలు కారణంపై టీడీపీ క్షేత్రస్థాయి క్యాడర్, సీనియర్ లీడర్లలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఎలక్షన్ల సమయంలో పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్లే గ్రౌండ్ లెవెల్ లీడర్లను పక్కన పెట్టి.. కేవలం ఫండింగ్ చేసేవారికి, తెర వెనుక చక్రం తిప్పే కార్పొరేట్ శక్తులకే చంద్రబాబు రాజ్యసభ సీట్లు ఇస్తారనే విమర్శ మొదటి నుండి ఉంది. ఢిల్లీలో లాబీలు నడపడానికి, వ్యాపార ప్రయోజనాలు కాపాడుకోవడానికి వచ్చే ఇలాంటి పారాచూట్ నేతలకు పార్టీ సిద్ధాంతాల పట్ల గానీ, కార్యకర్తల కష్టం పట్ల గానీ ఎలాంటి నిబద్ధత ఉండదు. అందుకే, అధికారం మారగానే వీరు తమ వ్యాపారాలను, కాంట్రాక్టులను కాపాడుకోవడానికి అధికార పార్టీలోకి జంప్ అయిపోతుంటారని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది.ప్రస్తుతం జూన్ 2026 లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో మళ్లీ లాబీయింగ్ మొదలైంది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేనకు ఒక సీటు కేటాయించగా, మిగిలిన మూడు సీట్లు టీడీపీ దక్కించుకోనుంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న సానా సతీష్ బాబు తో పాటు పాత కార్పొరేట్ ముఖాలు మళ్లీ సీట్ల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈసారి నారా లోకేష్ నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుండటంతో.. యువతకు, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న బీసీ, ఎస్సీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత తప్పులను పునరావృతం చేయవద్దని కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ స్థాయిలో తన వాయిస్ బలంగా వినిపించాలంటే రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకం. కానీ టీడీపీ విషయంలో ఈ సభ్యులు కేవలం పవర్ బ్రోకర్లు గా మిగిలిపోతున్నారనేది నిజం. సురేష్ ప్రభు లాంటి బయటి వ్యక్తులకు కూడా గతంలో టీడీపీ సీటు ఇచ్చింది. ఈ ధోరణి మారకపోతే, భవిష్యత్తులో కూడా ఈ సీట్లు పార్టీకి కేవలం తాత్కాలిక అవసరాలకే ఉపయోగపడతాయి తప్ప, నమ్మకమైన లీడర్‌షిప్‌ను తయారు చేయలేవు. చంద్రబాబు నాయుడు ఈ ఎన్నికల్లో కేవలం ఆర్థిక అంగబలాన్ని మాత్రమే చూడకుండా, రాజకీయ అంగబలం, నమ్మకమైన చరిత్ర ఉన్నవారికే పెద్దల సభకు పంపితేనే ఈ రాజ్యసభ శాపం నుంచి టీడీపీ బయటపడగలదని టీడీపీ క్యాడర్ అభిప్రాయం.

# షఃర్మిళకు హ్యాండేనా..

**కడప, జూన్ 3, పెన్ పవర్:** వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కుతుందా? అదీ కర్ణాటక నుంచి. అది సాధ్యమయ్యే పనేనా? కర్ణాటక కాంగ్రెస్ స్థానిక నేతలు ఇందుకు అంగీకరిస్తారా? అన్నది ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలసి వచ్చిన వైఎస్ షర్మిల కొంత ఉత్సాహంతో కనిపించారు. అయితే సమావేశంలో ఏం జరిగిందో తెలియదు కానీ, వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి



రాజ్యసభ పదవి దక్కుతుందని మాత్రం జోరుగా ప్రచారం అయితే జరుగుతుంది. తెలంగాణ ఎన్నికల సందర్భంగా తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడంతో షర్మిలకు రెండు హామీలు లభించాయి. ఒకటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ గా నియమించడం, రెండోది రాజ్యసభ పదవి ఇవ్వడం. ఈ రెండు హామీలను నెరవేరుస్తామని చెప్పింది.తెలంగాణ వ్యవసాయం

ఇందులో ఏపీసీసీ చీఫ్ గా షర్మిలను నియమించారు. ఒక హామీ నెరవేరింది. కానీ రెండేళ్ల నుంచి మరొక హామీ మాత్రం నెరవేరలేదు. ఆ హామీని త్వరలో కర్ణాటకకు ముఖ్యమంత్రి కాబోతున్న డీకే శివకుమార్ ఇవ్వడంతో ఇప్పుడు ఆయనకు రాజకీయంగా ఇబ్బందిగా మారే అవకాశముంది. ఏపీలో కాంగ్రెస్ కు ఒక్కస్థానం కూడా లేకపోవడంతో తెలంగాణ, కర్ణాటకల నుంచి మాత్రమే వైఎస్ షర్మిలకు రాజ్యసభ పదవి ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ నుంచి ఇస్తే మళ్లీ సెంటిమెంట్ రాసుకుంటుందని భావించి కర్ణాటక నుంచి ఇవ్వాలని నిర్ణయించారు కానీ కర్ణాటకలో స్థానిక నేతల నుంచి ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.డీకే శివకుమార్ కు ఇది బిగ్ టాస్క్ అని చెప్పాలి. ముఖ్యమంత్రి అయిన వెంటనే రాజ్యసభ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. వైఎస్ షర్మిలను ఎంపిక చేస్తే స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి డీకేకు వ్యతిరేకత మామూలుగా ఉండదు. లోకల్స్ కు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఎలా ఇస్తారన్న ప్రశ్న తలెత్తుంది. పైగా జాతీయ స్థాయి నేత అయితే ఓకే. కానీ పొరుగు రాష్ట్రంలోనేతకు ఎలా రాజ్యసభ పదవి ఇస్తారన్న ప్రశ్న ఖచ్చితంగా ఎదురవుతుంది. ఢిల్లీలో హైకమాండ్ ఇచ్చిన గ్యారంటీ కావడంతో అమలు చేస్తారా? లేదా? అన్నది ఇప్పుడు కర్ణాటక కాంగ్రెస్ అగ్రనేతలకు పెద్ద సమస్యగా మారింది. వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు ఇచ్చినందువల్ల ఉపయోగం లేదు. అదే మరో రెండేళ్లలో కర్ణాటక ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ వివాదం ఊపందుకుంటే పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందన్న కామెంట్స్ మాత్రం కన్నడ మీడియాలో జోరుగా కనిపిస్తున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# జనసేనానిపై విమర్శలు.. సీన్‌లోకి చంద్రబాబు - తెలంగాణ లీడర్లకు గట్టి కౌంటర్



ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ నేతలు చేస్తున్న విమర్శలపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. ప్రజాసేవ, అభివృద్ధిలో పోటీ పడాలే తప్ప, ప్రాంతాల పేరుతో లేనిపోని విద్వేషాలు రెచ్చగొట్టడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. తెలంగాణ నేతల విమర్శలను తిప్పికొడుతూ బలమైన కౌంటర్ ఇచ్చారు. రెండు రోజులుగా డిప్యూటీ సీఎం టార్గెట్ గా తెలంగాణ రాజకీయ పక్షాలు ఘాటు విమర్శలతో విరుచుకుపడుతున్నాయి. ఏపీకి చెందిన పవన్ కు తెలంగాణలో ఏం పని అంటూ ప్రశ్నిస్తున్నాయి. దీనిపై స్పందించిన చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కు భరోసాగా నిలిచారు. గత రెండు రోజులుగా పవన్ వర్సెస్ తెలంగాణ నేతల మధ్యే డైలాగ్ వార్ కొనసాగుతుండగా, తాజాగా చంద్రబాబు ఎంట్రీ ఇచ్చారు. దీంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత రసవత్తరంగా మారేలా కనిపిస్తున్నాయని అంటున్నారు.

**విభజన జరిగి 12 ఏళ్లు.. ఇప్పుడు విద్వేషాలా?**

ఉప ముఖ్యమంత్రి పవన్ పై తెలంగాణ నేతలు చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుపట్టారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచిపోయాయని, ప్రస్తుతం రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఎవరి పనుల్లో వారు ఉన్నామని చంద్రబాబు గుర్తుచేశారు. తెలంగాణలోని కొందరు నాయకులు ఇప్పుడు పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి అనవసర అంశాలను లేవనెత్తి సమాజంలో లేనిపోని సమస్యలను, విద్వేషాలను సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. ఏ ప్రాంతానికి ఎవరు ఎలాంటి సేవలు చేశారో ప్రజలకు పూర్తిగా తెలుసని, నాయకులు అనవసర విషయాలపై సమయం వృథా చేయకూడదని అన్నారు. “నేను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేసి వచ్చాను. అక్కడికి కర్నాటక నుండి డీకే శివకుమార్‌తోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల నేతలు, ఆలిండియా లీడర్స్ వచ్చారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడైనా ప్రచారం చేయవచ్చు, సేవ చేయవచ్చు. రాజకీయాల్లో ప్రాంతీయ పట్టింపులు ప్రగతికి అవరోధం.” అంటూ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్ పార్టీ కూడా ఉందన్నారు. బీఆర్ఎస్ తమది జాతీయ పార్టీ అని ప్రకటించుకుని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా తమ శాఖను ఏర్పాటు చేసి, పార్టీని విస్తరిస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ పార్టీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లవచ్చు కానీ, ఇతర నేతలు మాట్లాడితే తప్పా అని ప్రశ్నించారు. “అప్పుడు విస్తరిస్తామన్న నాయకులు, ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదు” అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఖ్యాతి**

తెలుగువారి ప్రతిభ కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం కాలేదని, అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి ప్రపంచ దేశాలలో తెలుగువారు ఉన్నతమైన రాజ్యాంగ పదవులను అనుభవిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. అక్కడి రాజ్యాంగాల ప్రకారం వారు ఎంతో అద్భుతంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఎవరు మంచిగా సేవలందిస్తారో.. వాళ్లే ఆయా ప్రాంతాల్లో నాయకులుగా ఎదుగుతారని ఆయన వివరించారు. నాయకులకు ఉండాల్సింది ప్రాంతీయ అహంకారం కాదు, సేవా గుణమని చంద్రబాబు పేర్కొన్నారు. నాయకులందరూ అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు ఎలా అందించాలనే దానిపైనే దృష్టి పెట్టాలని, అంతేకాని విమర్శలతో విద్వేషాలు రగల్చడం తగదని తెలంగాణ నేతలకు ఏపీ ముఖ్యమంత్రి గట్టి సందేశాన్ని ఇచ్చారు.

# అదే నా రాస్తా....శేషేంద్ర కవితను ట్వీట్ చేసిన పవన్



గుంటూరు శేషేంద్ర శర్మ. యువ కవి. విమర్శకుడు, సాహితీవేత్త, వక్త. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో పండితుడు. వచన కవిత్వం, పద్యరచన రెండింటిలో సమాన ప్రతిభావంతుడు. ఆధునిక కవిత్వంలో అందె వేసిన చేయి. అన్నింటికీ మించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి ఆయన కవితలు ఇష్టం. మరో మారు శేషేంద్ర శర్మను ఆయన కవితను తలచుకున్నారు పవన్ కళ్యాణ్. నిన్నటికి నిన్న తెలంగాణా ఆవిర్భావ దినోత్సవం వేళ తన పార్టీ తెలంగాణా యూనిట్ తో మీటింగ్ ఏర్పాటు చేసుకున్నా అనుమతి దక్కలేదు. దాంతో ప్రెస్ మీట్ లోనే మొత్తం చెప్పాల్సింది చెప్పేసి సంచలనం క్రియేట్ చేశారు పవన్. దాని ప్రకంపనలు తెలంగాణా రాష్ట్రంలో రాజకీయంగా ఇంకా బలంగా గట్టిగా వినిపిస్తున్న వేళ పవన్ శేషేంద్ర శర్మ కవితను జస్ట్ అలా ట్వీట్ చేశారు. అందులోని భావాలను చూస్తే పవన్ రాజకీయ పథం కానీ ఆయన ఆలోచనా విధానం కానీ ఎక్కడా తగ్గేదే లేదన్నట్లుగా సంకేతం ఇస్తున్నట్లుగా ఉంది అంటున్నారు.

**ప్రాణాల్ని ఆట బంతుల్లా విసిరేస్తుందో :**

ఇక శేషేంద్ర శర్మ కవితల గురించి చెప్పాల్సింది లేదు. ఒక్కో మాట అగ్ని కణంగా వీర విహారం చేస్తుంది. ఆయన రాసిన ఒక చిన్న కవితలో మొత్తం ప్రపంచాన్ని ఒడిసిపట్టి ఘనమైన సందేశం ఇస్తుంది. అలాంటి అగ్గి రవ్వ లాంటి ఒక కవితను ఎంపిక చేసుకుని మరీ సరైన సమయంలో సరైన వ్యాఖ్యానం అన్నట్లుగా పవన్ వదిలారు. ఇంతకీ ఆ కవిత సాగిన తీరు చూస్తే మెదడులోని పవర్ పదునూ రెండూ పోటీ పడి జోరు చేయడం ఖాయం. ఇంతకీ ఆ కవిత ఏమిటి అంటే ఏ రాస్తా యుద్ధాలు చేస్తుందో ప్రాణాల్ని ఆటబంతుల్లా విసిరేస్తుందో గెలుస్తుందో ఓడుతుందో కానీ ముందుకు పోతుందో అదే నా రాస్తా ఏ రాస్తాలో సంకెళ్లు కూడా సవాల్ చేస్తాయో ఏ రాస్తాలో అపజయం కూడా అగ్నిజ్వాలై మండుతుందో ఏ రాస్తాలో మరణం మహా ప్రబంధంగా ప్రతిధ్వనిస్తుందో అదే నా రాస్తా...ఇలా అగ్ని ప్రభంజనంగా సాగిపోయే ఈ కవితని ఏరి కోరి మరీ పవన్ ట్వీట్ చేయడం వెనక ఉద్దేశ్యం ఏమిటి అంటే ఆయన అభిమాన కవిత అనుకోవచ్చు.

**ఆగేది లేదనేగా :**

అంతే కాదు వర్తమాన రాజకీయాలలో పవన్ కళ్యాణ్ దూకుడుగా ముందుకు సాగుతున్నారు. ఆయన తనకు ఎదురైన అడ్డులూ ఆటంకాలను సైతం అధిగమించి తాను అనుకుంటున్న గమ్యానికి చేరాలని చూస్తున్నారు. మరి ఈ కవితలో అర్థం పరమార్ధం చూసినా అదే శబ్దం ధ్వనిస్తోంది. ఇందులో ఉన్న ఒక్కో మాట కూడా నిప్పు కణికగా మండుతోంది. ప్రాణాలను సైతం ఆట బంతుల్లా విసిరేసే రాస్తా అంటే కడు భయంకరమైనది, అలాగే ఏ రాస్తా అయితే యుద్ధాలు చేస్తుందో అని కూడా ఉంది. సంకెళ్ళు అగ్ని జ్వాలలు సవాళ్ళు అపజయాలు ఓటములు ఇలా ఎన్ని అడ్డంకులు ఉన్నా అదే నా రాస్తా అని ఈ కవిత ద్వారా పవన్ తన సైన్యానికి ఏమైన సందేశం ఇవ్వదలచారా అంటే ఆలోచించాల్సిందే. ఏది ఏమైనా శేషేంద్ర శర్మ అధ్భుతమైన కవితను ట్వీట్ చేయడం ద్వారా ఎన్నో మెదళ్ళకు పదును పెట్టించారు, అలాగే నిస్తేజమైన జనాలు ఈ కవిత చదివితే చైతన్యం పుట్టేలా చేశారు. సో అందుకు పవన్ కి ధన్యవాదాలు చెప్పుకోవాల్సింది మరి.

# అమెరికా కలకు ఇప్పుడు టికెట్ రూ.95 లక్షలు.. అయినా క్యూ మాత్రం తగ్గట్లేదు!




‘అమెరికా వెళ్తే లైఫ్ సెటిల్” అనే రోజులు పోయాయి. “అమెరికా వెళ్లాలంటే ముందు ఇల్లు అమ్మాలి” అనే పరిస్థితి వచ్చేసింది. అమెరికన్ డ్రీమ్ కోసం భారతీయులు పడుతున్న ఆరాటం ఇప్పుడు మరింత ఖరీదైన వ్యవహారంగా మారింది. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానాల ప్రభావమో ఏమో కానీ హెచ్1బీ వీసా ఫాస్ట్ ట్రాక్ ప్రాసెసింగ్ ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు (సుమారు రూ.95.6 లక్షలు) పెంచేశారు. అయినప్పటికీ మనవాళ్ల క్యూ మాత్రం తగ్గడం లేదు.

**లక్షల్లో దరఖాస్తులు.. కోట్లలో ఫీజులు!**

అమెరికా హోమ్‌లాండ్ సెక్యూరిటీ సెక్రటరీ మార్క్‌వేన్ ముల్లిన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 2.86 లక్షల హెచ్1బీ దరఖాస్తులు వచ్చాయి. ఇందులో షాకింగ్ విషయమేమిటంటే.. దాదాపు 2 లక్షల మందికి పైగా అభ్యర్థులు “వీసా త్వరగా వస్తే చాలు” అంటూ రూ.95 లక్షల ప్రీమియం ఫీజును చెల్లించడానికి వెనకాడలేదు. మనదేశంలో ఇల్లు కొనేందుకు 20 ఏళ్లు ఈఎంఐ కట్టే మొత్తాన్ని అక్కడ కేవలం వీసా ప్రాసెసింగ్ కోసమే ముందుగా చెల్లిస్తుండటం గమనార్హం.

**కథలో అసలు ట్విస్ట్ ఇదే..**

ఫీజు కట్టేందుకు యువత సిద్ధంగా ఉన్నా అమెరికాలోని కంపెనీలు మాత్రం వెనకడుగు వేస్తున్నాయి. ఈ భారీ ఫీజుల భారం భరించలేక చాలా సంస్థలు ఉద్యోగ ఆఫర్లను వెనక్కి తీసుకుంటున్నాయి. మరికొన్ని జాయినింగ్ డేట్లను వాయిదా వేస్తుండగా విదేశీ నియామకాలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. అంటే చేతిలో ఉద్యోగం ఉంటుందో లేదో తెలియని అయోమయంలో కూడా అభ్యర్థులు లక్ష డాలర్లు సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది.

**సెనేటర్ల ఆందోళన**

ఈ భారీ ఫీజుల పెంపుపై అమెరికా సెనేటర్లు కూడా పెదవి విరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రులు, పాఠశాలలు విదేశీ డాక్టర్లు, టీచర్లపైనే ఆధారపడుతున్నాయని ఈ నిర్ణయం వల్ల ఆయా రంగాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**తగ్గేదే లే అంటున్న భారతీయులు**

ఇన్ని సవాళ్లు ఉన్నా భారతీయ ఐటీ నిపుణులలో అమెరికా క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇక్కడ కంపెనీల్లో బెంచ్ మీద కూర్చోవడం కంటే అక్కడ వీసా క్యూలో నిలబడటమే బెటర్ అనే ధోరణి కనిపిస్తోంది. మొత్తానికి అమెరికా కల ఇప్పుడు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరింది. మరి ఇంత రిస్క్ చేసి రూ.95 లక్షలు కడితే వీసా చేతికి వస్తుందా? లేక కేవలం ఫీజు రసీదు మాత్రమే మిగులుతుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

# అబ్బే బంగారం అమ్మలేదు.. వార్తలన్నీ అబద్ధాలు.. ఆర్బీఐ బయటపడింది..




దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి సోషల్ మీడియా, పలు అంతర్జాతీయ వేదికల్లో వస్తున్న ఒక కీలక వార్తపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీవ్రంగా స్పందించింది. భారత దేశానికి చెందిన బంగారు నిల్వలను ఆర్బీఐ విక్రయించిందంటూ ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ ‘బ్లూమ్‌బర్గ్’ ప్రచురించిన కథనాన్ని కేంద్ర బ్యాంక్ పూర్తిగా ఖండించింది. తమ వద్ద ఉన్న గోల్డ్ రిజర్వులలో ఎలాంటి తగ్గుదల లేదని, దేశ బంగారు నిల్వలు పూర్తిగా సురక్షితంగా యథాతథంగా ఉన్నాయని ఆర్బీఐ స్పష్టం చేసింది.

**అసలు ప్రచారం ఏమిటి? బ్లూమ్‌బర్గ్ కథనంలో ఏముంది?**

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగాయి. దీనివల్ల భారత ఇంధన దిగుమతి వ్యయం భారీగా పెరిగింది. మరోవైపు దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు తమ ఈక్విటీలను భారీగా ఉపసంహరించుకుంటున్నారు. ఈ పరిణామాల వల్ల మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగి, భారత రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడి పడింది.

ఈ నేపథ్యంలో రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలను (ఫారెక్స్ రిజర్వ్స్) బలోపేతం చేయడానికి ఆర్బీఐ సుమారు 6 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని విక్రయించిందంటూ బ్లూమ్‌బర్గ్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ వార్త దేశీయంగా ఆర్థిక వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

**ఆర్బీఐ వద్ద ప్రస్తుతం ఉన్న గోల్డ్ నిల్వలు ఎంత?**

ఈ తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేస్తూ ఆర్బీఐ అధికారిక గణాంకాలను విడుదల చేసింది. ప్రస్తుతం భారతదేశం వద్ద 880.52 టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయని కేంద్ర బ్యాంక్ వెల్లడించింది. “గోల్డ్ రిజర్వుల అమ్మకంపై వస్తున్న వార్తలు ముమ్మాటికీ వాస్తవ విరుద్ధం. దేశ బంగారు నిల్వల్లో ఎలాంటి విక్రయాలు జరగలేదు. వీటికి సంబంధించిన పూర్తి సమాచారం ఆర్బీఐ అధికారిక వెబ్‌సైట్‌లోని ‘మంత్లీ బులెటిన్’ లో పారదర్శకంగా అందుబాటులో ఉంది. ప్రజలు, పెట్టుబడిదారులు ఇటువంటి వదంతులను నమ్మవద్దు.” అంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

**ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి ఉన్న మాట వాస్తవమేనా?**

దేశ ఫారెక్స్ నిల్వలు గత కొన్ని నెలలుగా ఒత్తిడిని ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తే ఫిబ్రవరి నెలలో ₹728.49 బిలియన్ డాలర్లు ఉండగా.. ప్రస్తుతం ₹681.40కి పడిపోయింది. దిగుమతి బిల్లులు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లలో హెచ్చుతగ్గుల వల్ల ఫారెక్స్ నిల్వలు తగ్గినప్పటికీ ఆ లోటును పూడ్చడానికి బంగారాన్ని అమ్మాల్సిన అవసరం ఆర్బీఐకి రాలేదని స్పష్టమవుతోంది.

**అధికారిక సమాచారాన్నే నమ్మండి**

భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత బలంగా ఉందని, తాత్కాలిక అంతర్జాతీయ పరిణామాల వల్ల రూపాయిపై ఒత్తిడి ఉన్నప్పటికీ దేశ వ్యూహాత్మక నిల్వలు సురక్షితంగా ఉన్నాయని ఆర్బీఐ భరోసా ఇచ్చింది. దేశ ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన సున్నితమైన విషయాలలో కేవలం కేంద్ర బ్యాంక్ విడుదల చేసే అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఆర్బీఐ ప్రజలకు, మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేసింది.

# కర్ణాటకలో కాంగ్రెస్ 2.0 సర్కార్.. పూర్తయిన డీకే పట్టాభిషేకం!



కర్ణాటక రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కాంగ్రెస్ ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియం సాక్షిగా, జనసందోహం మధ్య ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో మూడేళ్ల అనంతరం కాంగ్రెస్ 2.0 సర్కార్ పాలన ప్రారంభం అయిందని వ్యాఖ్యానిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలలో గెలిచి అధికారంలోకి వచ్చింది. అప్పట్లో సీనియర్ నేతలు, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవికి పోటీ పడ్డారు. అధికార పంపిణీలో భాగంగా ఇద్దరి మధ్య రాజీ కుదర్చి ఇద్దరూ ముఖ్యమంత్రి పదవిని సమానంగా పంచుకోవాలని అధిష్టానం సూచించింది. దీంతో గత నెలలో సిద్దరామయ్య రాజీనామా చేయగా, ఆయన స్థానంలో డీకే శివకుమార్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు.

**13 మంది కొత్త మంత్రులు**

ఇక కర్ణాటక కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తోపాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గత ప్రభుత్వంలో హోంశాఖ మంత్రిగా పనిచేసిన పరమేశ్వరకు ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ చేశారు. అదేవిధంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు మరోసారి మంత్రి చాన్స్ దక్కింది. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొడుకు, ఎమ్మెల్సీ యతీంద్ర కూడా మంత్రిగా ప్రమాణం చేశారు. గత ప్రభుత్వంలో మొత్తం 24 మంది మంత్రులు ఉండగా, ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రస్తుతానికి 13 మందితోనే ప్రమాణం చేశారు. అధిష్టానంతో చర్చల అనంతరం మరో విడత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెబుతున్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, సీఎం, సుఖ్విందర్ సింగ్ సుఖు, వీడీ సతీషన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు.

కాంగ్రెస్ కార్యకర్తల కోలాహలం మధ్య ఆధ్యాత్మిక వేత్తల ఆశీస్సులు తీసుకుని డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. చేతిలో చిన్న రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని వేలాది మంది అభిమానుల సాక్షిగా ప్రమాణం చేశారు. డీకేఎస్ వేదికపైకి రాగానే స్టేడియం మొత్తం ‘డీకే.. డీకే..’ అంటూ మార్మోగిపోయింది. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ముగ్గురూ చేతులు పైకెత్తి ప్రజలకు అభివాదం చేసిన దృశ్యం ఈ వేడుకకే హైలైట్‌గా నిలిచింది.

**దశాబ్దాల కల**

కర్ణాటకలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్న డీకే శివకుమార్ ఎప్పటికైనా రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఒంటిచేత్తో అధికారంలోకి తీసుకువచ్చిన డీకే.. ముఖ్యమంత్రి పదవిపై తనదే అన్న ధీమా వ్యక్తం చేశారు. అయితే అధిష్టానం మాత్రం సీనియర్ నేతగా ముందు సిద్దరామయ్యకు అవకాశం ఇచ్చింది. అయినప్పటికీ ఎప్పటికైనా తానే సీఎం అన్న ఆశతోనే డీకే కాలం గడిపారు. ఎట్టకేలకు ఆయన నిరీక్షణ ఫలించింది. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ చాకచక్యంగా అధికార బదిలీ పూర్తి చేసి డీకేను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొబెట్టిందని అంటున్నారు.

# పెట్రోల్ తిప్పలు తప్పనున్నాయి.. హీరో మోటోకార్ప్ సంచలనం: మార్కెట్లోకి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్..

పెరుగుతున్న పెట్రోల్ ధరలతో విసిగిపోయిన వాహనదారులకు ఈరోజు ఒక గొప్ప శుభవార్త అందింది. భారతదేశపు నంబర్ వన్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ అయిన హీరో మోటోకార్ప్ మొదటి ఫ్లెక్స్ ఫ్యూయల్ బైకును ఈరోజు (జూన్ 3) అధికారికంగా విడుదల చేయనుంది...

ఢిల్లీలో జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథిగా, కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి హాజరు కానున్నారు. స్వచ్ఛమైన, పర్యావరణ అనుకూల ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే విషయంలో భారతీయ ఆటోమొబైల్స్ చరిత్రలో ఇదొక పెద్ద మైలురాయిగా నిలుస్తుందని చెబుతున్నారు.

**ఫ్లెక్స్ ఫ్యూయల్ టెక్నాలజీ అంటే ఏమిటి?**

చాలా మంది సాధారణంగా పెట్రోల్‌తో నడిచే బైక్‌లను ఉపయోగిస్తారు. ఈ మధ్య బ్యాటరీతో నడిచే ఎలక్ట్రిక్ బైక్‌లు కూడా ప్రజాదరణ పొందుతున్నాయి. కానీ ఈ కొత్త ఫ్లెక్స్ ఫ్యూయల్ వెహికల్ టెక్నాలజీ ఇంజన్, కేవలం పెట్రోల్‌తోనే కాకుండా, పెట్రోల్ ఇంకా ఇథనాల్ మిశ్రమంతో సహా ఏ ఇంధనంతోనైనా నడుస్తుంది.

**E20 & E85 అంటే ఏమిటి?**

ప్రస్తుతం మన మార్కెట్లో లభించే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమం ఉంటుంది, దీనిని E20 పెట్రోల్ అంటారు. అయితే, ఈరోజు విడుదల కానున్న హీరో బైక్, 85 శాతం ఇథనాల్ ఉండే ఙ85 ఇంధనంతో గానీ, లేదా 100 శాతం ఇథనాల్ ఉండే E100 ఇంధనంతో నడుస్తుంది.

ఈ ఇథనాల్‌ను చెరకు. ధాన్యాల నుండి తయారు చేస్తారు కాబట్టి,





దీని ధర పెట్రోల్ కంటే చాలా తక్కువగా ఉంటుంది. దీనివల్ల వినియోగదారులకు ప్రయాణ ఖర్చులు ఆదా అవ్వడమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా చాలా తగ్గుతుంది.

**హీరో ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్ ఏ మోడల్‌లో వస్తుందంటే**

హీరో కొత్త బైక్ పేరును ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. కానీ ఆటోమొబైల్ పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ బైక్ భారత ప్రజల ఆల్-టైమ్ ఫేవరెట్ అయిన హీరో స్ప్లెండర్ లేదా హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందించబడుతుంది.

గత సంవత్సరం జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో హీరో ఎఫ్ డీలక్స్ బైక్ ఫ్లెక్స్ ఫ్యూయల్ ప్రోటోటైప్‌ను ప్రదర్శించింది, కాబట్టి ఈ కొత్త పర్యావరణ అనుకూల బైక్ మధ్యతరగతి ప్రజలు కొనగలిగే బడ్జెట్‌లో విడుదల అవుతుందని దాదాపు ఖచ్చితంగా చెప్పవచ్చు.

**ప్రస్తుతం భారతదేశంలో ఫ్లెక్స్ ఫ్యూయల్ ట్రెండ్**

ప్రస్తుతం, భారత ద్విచక్ర వాహన మార్కెట్‌లో సుజుకి గిక్సర్ ఎస్‌ఎఫ్ 250 అనే ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్‌ను విక్రయిస్తున్న ఏకైక సంస్థ సుజుకి మాత్రమే. దీని ధర సుమారు రూ. 1.98 లక్షలు. గతంలో హోండా ప్రవేశపెట్టిన ఈ బైక్‌ను ఇప్పుడు నిలిపివేశారు. ఇలాంటి పరిస్థితుల్లో, తక్కువ ధర కమ్యూటర్ విభాగంలోకి హీరో కంపెనీ ఎంట్రీ ఇతర కంపెనీలకు గట్టి పోటీనిస్తుంది.

కేవలం బైక్‌లే కాదు, మారుతి సుజుకి జనాదరణ పొందిన వాగన్‌ఆర్ కారు ఫ్లెక్స్ ఫ్యూయల్ వెర్షన్‌ను జూన్ 5వ తేదీన (ప్రపంచ పర్యావరణ దినోత్సవం) విడుదల చేయాలని చూస్తుంది. మొత్తం మీద, పెట్రోల్ చింత లేకుండా, తక్కువ ధరకే లభించే ఈ ఎకో బైక్‌లు రాబోయే రోజుల్లో సంచలనం సృష్టించనున్నాయి.

# ఈసారి 30వేల మందిని పీకేస్తున్న ఒరాకిల్.. టెక్కీలకు అదే ఆఖరి వర్కింగ్ డే!







బీభత్సమైన లాభాలు వస్తున్నప్పటికీ ఉద్యోగులను తొలగించే విషయంలో అస్సలు తగ్గేదే లే అంటోంది ఒరాకిల్. అమెరికాకు చెందిన ఈ టెక్ దిగ్గజం కొన్ని నెలల కిందట వేల సంఖ్యలో ఉద్యోగులను లేఆఫ్ చేసి ఆశ్చర్యానికి గురిచేయగా.. మళ్లీ అదే రూటులో వెళుతోంది. వ్యాపారం, ఆదాయం పెరుగుతున్నప్పటికీ ఏఐ కోసం ఉద్యోగులను బలివ్వక తప్పని పరిస్థితిలో కంపెనీ ఉందని టెక్ నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ సారి ఎంత మందిని ఎప్పుడు లేఆఫ్ చేయబోతుందనే వివరాలు ఇవే..

ఒరాకిల్ కార్పొరేషన్ తన హిస్టరీలోనే అత్యంత భారీ లేఆఫ్స్ ప్రక్రియను ముగింపు దశకు తీసుకువచ్చింది. జూన్ 15 నాటికి వేలాది మంది ఉద్యోగులు సంస్థ నుంచి అధికారికంగా తప్పుకోనున్నారు. ఈ భారీ ఉద్వాసనల్లో భాగంగా ఒరాకిల్ తన ప్రపంచవ్యాప్త శ్రామిక శక్తిలో దాదాపు 18 శాతం.. అంటే సుమారు 30వేల మంది ఉద్యోగులను తొలగిస్తుండటం టెక్ పరిశ్రమలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

సాధారణంగా నష్టాల్లో ఉన్న కంపెనీలు ఉద్యోగులను తీసేస్తుంటాయి. కానీ ఒరాకిల్ క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో అద్భుతమైన వృద్ధిని, భారీ లాభాలను నమోదు చేస్తున్నప్పటికీ ఈ స్థాయిలో లేఆఫ్స్ కొనసాగించటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరం 3వ త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 22 శాతం పెరిగి 17.2 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో క్లౌడ్ ఆదాయం 44 శాతం వృద్ధితో 8.9 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ముఖ్యంగా ఒరాకిల్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏఐ విభాగం ఏకంగా 243 శాతం, మల్టీక్లౌడ్ డేటాబేస్ విభాగం 531 శాతం అసాధారణ గ్రోత్ సాధించాయి.

ఇంతటి అద్భుత ఆర్థిక ఫలితాలు ఉన్నప్పటికీ కంపెనీ ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం వెనుక ఒక బలమైన వ్యూహం ఉంది. ఒరాకిల్ మేనేజ్‌మెంట్ ఇప్పుడు హ్యూమన్ లేబర్ కంటే ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెట్టుబడులకే అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అందుకోసం 2026 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 50 బిలియన్ డాలర్లను ఏఐ డేటా సెంటర్లు, క్లౌడ్ మౌలిక వసతుల విస్తరణకు కేటాయించింది. ఓపెన్‌ఏఐ, సాఫ్ట్‌బ్యాంక్ మద్దతుతో నడుస్తున్న ప్రతిష్టాత్మక స్టార్‌గేట్ ఏఐ ప్రాజెక్ట్‌లో కూడా ఒరాకిల్ కీలక భాగస్వామిగా ఉంది.

ఉద్యోగాలు కోల్పోతున్న టెక్కీలకు మాత్రం ఈ పరిణామం తీవ్ర దిగ్భ్రాంతిని మిగిల్చింది. ఒరాకిల్ అందిస్తున్న సెవెరెన్స్ ప్యాకేజీ గరిష్టంగా 26 వారాల వేతనంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కంపెనీలో ఇంకా మెచ్యూర్ కాని స్టాక్ అవార్డులను ఉద్యోగులు కోల్పోవాల్సి రావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. నష్టపరిహార నిబంధనలను మార్చాలని ఉద్యోగులు పిటిషన్ వేసినప్పటికీ ఒరాకిల్ యాజమాన్యం అందుకు నిరాకరించింది. భవిష్యత్తులో రాబోయే బిలియన్ డాలర్ల ఏఐ వ్యాపారం కోసం ఒరాకిల్ తన పాత సిబ్బందిని ఇలా నిర్దాక్షిణ్యంగా వదిలించుకుంటోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# AI దెబ్బతో ఐటీ ఉద్యోగులకు 'NO' డిమాండ్.. US రిటర్న్ టెక్కీలతో కొత్త కష్టాలు..!

భారత ఐటీ రంగం అనగానే ఒకప్పుడు టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ సంస్థల పేర్లే వినిపించేవి. అయితే ఇప్పుడు ఆంత్రోపిక్ సంస్థకు చెందిన 'క్లాడ్ కోవర్క్' లాంటి ఏఐ టూల్స్ మార్కెట్లోకి రావడంతో.. ఐటీ రంగంలో రిక్రూట్మెంట్స్ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒకవైపు కంపెనీలు భారీగా లేఆఫ్‌లు ప్రకటిస్తుంటే.. మరోవైపు కొత్త ఉద్యోగాల నియామకాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి.

దేశంలో ప్రస్తుతం యాక్టివ్ టెక్ ఉద్యోగాల సంఖ్య కేవలం 93వేలకి పడిపోయిందని ప్రముఖ స్టాఫింగ్ సంస్థ ఎక్స్‌ఫెనో విడుదల చేసిన జూన్ 2026 రిపోర్ట్ పేర్కొంది. ఇది గత 28 నెలల్లోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం గమనార్హం. గడిచిన నెలలోనే ఏకంగా 14 శాతం ఉద్యోగాలు తగ్గిపోయాయి. గత ఏడాది కాలంలో నెలవారీ ప్రాతిపదికన ఇంత భారీ తగ్గుదల ఎప్పుడూ నమోదు కాలేదు. దీంతో ఐటీ రంగంలో ప్రస్తుతం పరిస్థితులు ఎంత దారుణంగా రోజురోజుకూ మారిపోతున్నాయో ఇది రుజువు చేస్తోంది.

ఈ దారుణమైన పరిస్థితికి ఏఐ ప్రధాన కారణమని కేరీర్‌నెట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నీలాభ్ శుక్లా అభిప్రాయపడ్డారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఏఐ వాడకం ఇప్పుడు మెయిన్‌స్ట్రీమ్‌గా మారిపోయిందని.. ఇది గ్లోబల్ టెక్ హైరింగ్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. ముఖ్యంగా భారత్ వంటి భారీ వాల్యూమ్ కలిగిన టెక్ మార్కెట్లలో దీని స్వల్పకాలిక ప్రభావం మరింత బలంగా కనిపిస్తోందన్నారు. కేవలం ఐటీ సర్వీసెస్ మాత్రమే కాకుండా.. టెక్ స్టార్టప్‌లు, సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ రంగాలు కూడా ఈ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ చీకటి రోజుల్లో 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్' మాత్రమే కాస్త ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఇవి గత ఏడాదితో పోలిస్తే 31 శాతం వృద్ధితో 17వేల ఓపెనింగ్స్‌ను కలిగి




ఉన్నాయి. అయినప్పటికీ ఇది కూడా గత నెల కంటే 6 శాతం తక్కువే.

**యూఎస్ రిటర్న్ టెక్కీలతో కష్టాలు..**

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అమెరికాలో ఉద్యోగాలు పోగొట్టుకున్న వేలాది మంది భారతీయ ఎ-1బీ వీసా హోల్డర్లు స్వదేశానికి తిరిగి రావడం పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చుతోంది. అమెరికాలో ఉద్యోగం పోయిన 60 రోజుల్లోగా కొత్త కంపెనీని వెతుక్కోకపోతే భారత్‌కు వచ్చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో యూఎస్ నుండి వస్తున్న టాలెంట్‌కు స్వాగతం పలికే స్థితిలో భారతీయ మార్కెట్ లేదని ఎక్స్‌ఫెనో సహ వ్యవస్థాపకుడు కమల్ క్రాంత్ స్పష్టం చేశారు. దీంతో ఇప్పటికే ఇండియాలో జాబ్స్ పోగొట్టుకున్న, కొత్తగా ఐటీ జాబ్ మార్కెట్లోకి వస్తున్న వారికి అమెరికా నుంచి తిరిగి వచ్చిన వారు పోటీగా మారుతున్నారని నిపుణులు చెబుతున్నారు.

అమెరికాలో వీసా, ఇమ్మిగ్రేషన్ కష్టాలకు తోడు గ్రీన్ కార్డ్ రూల్స్ మార్పు తోడవటంతోఈ ఏడాది యూఎస్ వెళ్లే ఐటీ నిపుణుల కంటే.. అక్కడి నుండి భారత్‌కు తిరిగి వచ్చే వారి సంఖ్యే ఎక్కువగా ఉండబోతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కేవలం అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుస్తారని నిరూపించుకున్న వారికి మాత్రమే అక్కడ మినహాయింపు లభిస్తోంది. మొత్తానికి ఏఐ సృష్టించిన ఈ సునామీ.. అటు అమెరికాలో, ఇటు ఇండియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.

TCS, Infosys, Wiproలో విపరీతంగా పెరిగిన

# ఏఐ వాడకం.. 6 నెలల్లో కోపైలట్ లైసెన్సులు డబుల్




దేశంలోని టాప్ ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో.. ఏఐ వాడకంలో ప్రపంచంలోనే అతిపెద్ద రికార్డు సృష్టించాయి. ఈ 3 కంపెనీలు తమ రోజువారీ కార్యకలాపాల కోసం 'మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్' ఏఐ టూల్ వాడకాన్ని భారీగా పెంచాయి. ఒక్కో కంపెనీ లక్షకు పైగా ఉద్యోగులకు ఈ ఏఐ టూల్ అందించటంతో 6 నెలల్లోనే మొత్తం లైసెన్సుల సంఖ్య 3 లక్షల మార్కును దాటేసింది. ప్రపంచంలోనే అత్యంత భారీ ఎంటర్‌ప్రైజ్ ఏఐ విస్తరణల్లో ఒకటిగా దీనిని మైక్రోసాఫ్ట్ చూస్తోంది. గత ఏడాది కేవలం 50వేల లైసెన్సులతో ప్రారంభమైన ఈ ప్రయాణం.. 6 నెలల్లోనే రెట్టింపు కావడం విశేషం. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ కొనుగోలు నిర్ణయం కాదని.. ఏఐ ద్వారా కంపెనీలు పొందుతున్న అసలైన వ్యాపార విలువకు నిదర్శనమని మైక్రోసాఫ్ట్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ అంటున్నారు. కేవలం ప్రయోగాలు చేసే దశ దాటి.. ఏఐ టూల్స్ ఇప్పుడు ఐటీ ఉద్యోగుల రోజువారీ పనిలో అంతర్భాగంగా మారిపోయాయని చెప్పారు. ఈ 3 కంపెనీల్లో ఏఐ వాడకం అసాధారణంగా ఉంది. ఇన్ఫోసిస్‌లో 91 శాతం మంది, విప్రోలో 95 శాతం మంది ప్రతి నెల ఈ కోపైలట్‌ను వాడుతుండగా.. టీసీఎస్‌లో 86 శాతం మంది ఉద్యోగులు రోజూ దీనిని ఉపయోగిస్తున్నారట. విప్రో ఉద్యోగులు సొంతంగా 26వేలకు పైగా ఏఐ ఏజెంట్లను తయారు చేసుకున్నారు. ఈ ఏఐ వాడకం వల్ల టీసీఎస్ పరిశోధన, కంటెంట్ విభాగాల్లో ఉత్పాదకత 20 నుండి 25 శాతం పెరిగిందని తేలింది. అలాగే ఏదైనా విషయంపై రీసెర్చ్ చేయడం రెండు రెట్లు వేగవంతమైంది. ఏఐ రాకతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పనితీరు కూడా మారుతోంది. రొటీన్ కోడింగ్, టెస్టింగ్, డాక్యుమెంటేషన్ పనులను ఏఐ చూసుకుంటుండటంతో.. హ్యూమన్ టాలెంట్ ఇప్పుడు ఆర్కిటెక్చర్, సిస్టమ్ డిజైన్, సెక్యూరిటీ వంటి అత్యంత విలువైన పనులపై ఫోకస్ పెడుతోంది. గ్లోబల్ వర్క్ ట్రెండ్ ఇండెక్స్ ప్రకారం.. 58 శాతం మంది వినియోగదారులు ఏడాది క్రితం తాము చేయలేని క్లిష్టమైన పనులను ఇప్పుడు ఏఐ సహాయంతో ఈజీగానే చేయగలుగుతున్నారని తేలింది.

మన దేశంలో పెరుగుతున్న ఈ ఏఐ డిమాండ్‌కు అనుగుణంగా మైక్రోసాఫ్ట్ దేశంలో క్లౌడ్, ఏఐ మౌలిక వసతుల విస్తరణ కోసం నాలుగేళ్లలో దాదాపు రూ.లక్షా 50వేల కోట్ల భారీ పెట్టుబడిని ప్రకటిస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది చివర్లో హైదరాబాద్‌లో సరికొత్త డేటా సెంటర్ రీజియన్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. అలాగే దేశంలో 2 కోట్ల మంది ప్రజలకు, 20 లక్షల మంది ఉపాధ్యాయులకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందట.

# మేము ఒక్కగ్రాము బంగారం కూడా అమ్మలే.. లెక్కలతో సహా చెప్పిన RBI



భారత రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న బంగారు నిల్వలను అమ్మేసిందంటూ కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న వార్తలపై బుధవారం తీవ్రంగా స్పందించింది. తాము దేశ బంగారాన్ని అమ్మేసినట్లు వస్తున్న నివేదికలు పూర్తిగా తప్పని కొట్టిపారేసింది. సెంట్రల్ బ్యాంక్ వద్ద ఉన్న భౌతిక బంగారం నిల్వల్లో ఒక్క గ్రాము కూడా తగ్గలేదని వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా వ్యాపించిన ఊహాగానాలకు ఆర్బీఐ అధికారిక ప్రకటనతో తెరదించింది.

ఈ మేరకు ఎక్స్ లో ఆర్బీఐ ఒక స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. కొన్ని మీడియా స్టోరీల్లో ఆర్బీఐ బంగారం అమ్మినట్లు వస్తున్న నివేదికలు తమ దృష్టికి వచ్చాయని.. అయితే ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని రిజర్వు బ్యాంక్ స్పష్టం చేసింది. తమ వద్ద ఉన్న భౌతిక బంగారం నిల్వల వివరాలను ప్రతి నెలా విడుదల చేసే మంత్లీ బులెటిన్ ద్వారా క్రమం తప్పకుండా వెల్లడిస్తామని గుర్తు చేసింది. ప్రస్తుత తేదీ నాటికి ఆర్బీఐ వద్ద ఉన్న ఫిజికల్ గోల్డ్ రిజర్వ్ ఎలాంటి మార్పులు లేకుండా 880.52 టన్నులుగా కొనసాగుతున్నట్లు ప్రకటించింది.మరోవైపు ప్రభుత్వ అధికారిక సమాచార సంస్థ అయిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ యూనిట్ కూడా ఈ వ్యవహారంపై స్పందించింది. ఆర్బీఐ సుమారు 12 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని విక్రయించిందంటూ జరుగుతున్న ప్రచారాన్ని "ఫేక్" అని తేల్చేసింది. రిజర్వు బ్యాంక్ లెక్కల ప్రకారం భారత విదేశీ మారక నిల్వల్లో గోల్డ్ వాటా సెప్టెంబర్ 2025 చివరి నాటికి 13.92 శాతంగా ఉంటే.. అది మార్చి 31, 2026 నాటికి 16.70 శాతానికి పెరిగిందని పేర్కొంది. అంతేకాదు మే 22, 2026 నాటికి ఈ వాటా మరింత పెరిగి 16.85 శాతానికి చేరుకుందని పీఐబీ స్పష్టం చేసింది. గోల్డ్ రిజర్వ్ పెరుగుతుంటే అమ్మేశారనడం ముమ్మాటికీ అబద్ధమంది.

విదేశీ కరెన్సీ ఆస్తులను కొనుగోలు చేయడానికి మే 22తో ముగిసిన రెండు వారాల్లో ఆర్బీఐ దాదాపు 12 బిలియన్ డాలర్ల బంగారాన్ని విక్రయించి ఉండవచ్చని బ్లూమ్‌బెర్గ్ ఎకనామిక్స్ పేర్కొనడం ఈ వివాదానికి కారణమైంది. ఈ నేపథ్యంలోనే ఆర్బీఐ ప్రజలకు ఒక ముఖ్యమైన సూచన చేసింది. ఇలాంటి సున్నితమైన ఆర్థిక విషయాల్లో సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఆర్బీఐ సమయానుకూలంగా అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రజలకు స్పష్టం చేసింది.

# సృజనే ప్రధానం.. ఆకాశమే హద్దు



ప్రస్తుతం మనం ఉపయోగిస్తోన్న ప్రతి వస్తువూ ఎంతో కళాత్మకంగా రూపొందుతూ కనువిందు చేస్తోంది. వాటి ఆకారం వెనుక దాగున్నది డిజైన్ నిపుణుల సృజనాత్మకతే. వీరి ప్రతిభ కారణంగా విస్తరాకు నుంచి విమానం వరకూ అన్నీ ఎంతో ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా తయారవుతున్నాయి. దుస్తులు, ఆభరణాలు, సోఫాలు, యంత్రాలు, వాహనాలు, ఆన్‌లైన్ ఆటలు.. ఇవన్నీ డిజైన్ నిపుణులు సృష్టించినవే. సృజనలో వైవిధ్యాన్ని ఇష్టపడేవాళ్లు ఆసక్తి ఉంటే మేటి సంస్థలు అందిస్తోన్న డిజైన్ కోర్సులకు జై కొట్టొచ్చు.

ఆధునిక సాంకేతికత కారణంగా డిజైన్ మరింత నాణ్యంగా రూపొందడానికి వీలవుతోంది. సృజన, వినూత్న దృక్పథం, ఊహాశక్తి, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు ఉన్నవారు డిజైనర్లుగా రాణించగలరు. దేశంలో 2000కు పైగా కళాశాలలు/ సంస్థలు ఏదో ఒక డిజైన్ కోర్సు యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో అందిస్తున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత యూజీ కోర్సుల్లో ప్రవేశానికి యూసీడ్, డాట్, గాట్, సీయూఈటీ యూజీ ముఖ్యమైనవి. ఈ పరీక్షల స్కోరుతో దేశవ్యాప్తంగా పలు సంస్థల్లో చేరవచ్చు.

యూసీడ్: అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్ (యూసీడ్)ను ఐఐటీ బాంబే నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభతో ఐఐటీ-బాంబే, గువాహటి, హైదరాబాద్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ - జబల్‌పురుల్లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులో ప్రవేశం లభిస్తుంది.

డాట్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (నిడ్)లో బ్యాచిలర్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి డిజైన్ ఆప్టిట్యూట్ టెస్టు (డాట్) నిర్వహిస్తున్నారు. నిడ్ ప్రధాన క్యాంపస్ అహ్మదాబాద్‌లో ఉంది. ఇక్కడ బీడిజైన్ కోర్సు నడుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ (విజయవాడ), హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో నాలుగేళ్ల వ్యవధితో గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజైన్ (జీడీపీడీ) కోర్సు అందిస్తున్నారు. వీటన్నిటికీ డాట్ స్కోరే ప్రామాణికం. గాట్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)ల్లో ఫ్యాషన్ టెక్నాలజీతో పాటు డిజైన్ కోర్సులూ ఉన్నాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు (గాట్)తో ప్రవేశం లభిస్తుంది. పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో ప్రతిభతో ఎంపిక చేస్తారు. సీయూఈటీ యూజీ: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర ముఖ్య సంస్థల్లో డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి సెంట్రల్ యూనివర్సిటీస్ ఎంట్రెన్స్ టెస్టు (సీయూఈటీ) యూజీ రాసుకోవచ్చు.

ఎన్నో స్పెషలైజేషన్లు ఇంజినీరింగ్ కోర్సుల మాదిరి డిజైన్‌లో ఎన్నో స్పెషలైజేషన్లు ఉన్నాయి. విద్యార్థులు ఆసక్తి ప్రకారం వీటిని ఎంచుకోవచ్చు. వీటిలో కొన్నిటిని ఇంటర్మీడియట్ అన్ని గ్రూపుల వారూ అర్హులే. మిగతా వాటికి ఎంపీసీ నేపథ్యం ఉండాలి. డిజైన్ విభాగంలో ఏ స్పెషలైజేషన్ తీసుకున్నప్పటికీ అవకాశాలకు ఢోకాలేదు. మేటి సంస్థల్లో చదువుకున్నవారిని పలు బహుళజాతి కంపెనీలు, దేశీయ సంస్థలు క్యాంపస్ నియామకాల ద్వారా అధిక వేతనంతో ఉద్యోగాలిస్తున్నాయి. ఇండస్ట్రియల్ డిజైన్: ఈ కోర్సులు పూర్తిచేసుకున్నవారు తయారీ సంస్థల్లో వస్తువు, ఉత్పత్తిని డిజైన్ చేస్తారు. ఫర్నిచర్, ఇంటీరియర్, ఇంజినీరింగ్ ప్రొడక్టులు, సిస్టమ్స్, కన్జూమర్ గూడ్స్, క్రాఫ్ట్ బేస్డ్ ప్రొడక్ట్స్ యాక్సెసరీస్, పర్సనల్ యూజర్ ప్రొడక్ట్స్ కిచెన్ టూల్స్ అండ్ అప్లయన్సెస్, కొత్త తరం ఎలక్ట్రానిక్స్, ఐటీ, తదితర సంస్థల్లో పనిచేయవచ్చు. ఇండస్ట్రియల్ డిజైన్‌లో.. ప్రొడక్ట్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్ స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు. టెక్స్‌టైల్ డిజైన్: అభిరుచికి తగ్గట్టుగా టెక్స్‌టైల్ డిజైనర్లు వస్త్రాలను రూపొందిస్తారు. సౌకర్యవంతంగా ఉంటూనే, ఆకర్షణీయంగా ఉండేలా వాటిని తీర్చిదిద్దుతారు. వీరికి వస్త్ర పరిశ్రమలు, రెడీమేడ్ దుస్తుల కంపెనీలు, రిటైల్ సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి. గ్రాఫిక్ డిజైన్: ఈ కోర్సుతో గ్రాఫిక్ డిజైనర్లుగా, బ్రాండ్ ఐడెంటిటీ డెవలపర్లుగా, లోగో డిజైనర్లుగా, విజువల్ ఇమేజ్ డెవలపర్లుగా, మల్టీ మీడియా డెవలపర్లు, పబ్లికేషన్ డిజైనర్లుగా పనిచేయవచ్చు. బహుళజాతి కంపెనీలు, అడ్వర్టయిజింగ్, ఆన్‌లైన్ మీడియా, టీవీ, వినోద పరిశ్రమల్లో ఉద్యోగాలుంటాయి.

### ఇంటర్ తర్వాత?

యూజర్ ఎక్స్‌పీరియన్స్ డిజైన్: ఈ కోర్సులు పూర్తి చేసుకున్నవారు సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ మీడియా సంస్థల్లో కొలువులు పొందగలరు.

యానిమేషన్ ఫిల్మ్ డిజైన్: అడ్వర్టయిజింగ్, ఎక్స్‌పర్‌మెంటల్ యానిమేషన్, వీఎఫ్ఎక్స్, 2డీ, 3డీ యానిమేషన్, ప్రీ ప్రొడక్షన్, బుల్లితెర, వెండితెర, మార్కెటింగ్, ఈ కంటెంట్ డెవలప్‌మెంట్ సంస్థల్లో పనిచేయవచ్చు.వీడియో ఫిల్మ్ డిజైన్: ఫిల్మ్, టెలివిజన్, అడ్వర్ట యిజింగ్, పరిశ్రమల్లో ప్రొడ్యూసర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, సినిమాటోగ్రాఫర్, ఎడిటర్లుగా పనిచేయవచ్చు.ఫ్యాషన్ డిజైన్: ఈ కోర్సుతో దుస్తులు తయారుచేసే కంపెనీల్లో మేటి అవకాశాలు లభిస్తాయి. సొంతగా అవుట్‌లెట్ ఏర్పాటు చేసుకోవచ్చు. కొంత అనుభవంతో.. డిజైన్ కన్సల్టెంట్, స్టైలిస్ట్, కస్టమర్ డిజైనర్, ఫ్యాషన్ ఫోర్ కాస్టర్, ఇలస్ట్రేటర్, ఆంత్రప్రెన్యూర్, అకడమీషియన్, ఫ్యాషన్ మర్చండైజర్, బయ్యర్‌గానూ కొనసాగవచ్చు. కమ్యూనికేషన్ డిజైన్: యానిమేషన్ అండ్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్ ఇందులో భాగంగా ఉంటాయి. ప్రకటన, ఆన్‌లైన్ మీడియా, వినోద పరిశ్రమల్లో అవకాశాలు లభిస్తాయి. లెదర్ డిజైన్: పాదరక్షలు, బెల్టులు, బ్యాగులకు.. ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంది. ఈ విభాగాల్లో దేశీయ సంస్థలతోపాటు బహుళజాతి సంస్థలెన్నో ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి. అందువల్ల అవకాశాలు విస్తృతం. ప్రొడక్ట్ డిజైన్: పరిశ్రమ అవసరాలు, దైనందిన జీవితంలో ఉపయోగపడే వస్తువులు, ఇంట్లో, కార్యాలయాల్లో ఉపయోగించే పరికరాలు, ఆసుపత్రుల్లో వినియోగించేవి.. ఇవన్నీ ప్రొడక్ట్ డిజైన్ విభాగంలోకి వస్తాయి. ప్రొడక్ట్ డిజైనర్లు.. సులువుగా ఉపయోగించేలా, మన్నిక ఉండేలా, నిర్వహణ భారం లేకుండా, తక్కువ పరిమాణంలో ఇమిడేలా ఉత్పత్తులు రూపొందిస్తారు.

### కొన్ని పేరున్న సంస్థలు

డిజైన్ కోర్సులకు యూసీడ్, డాట్, గాట్ పరీక్షలు నిర్వహిస్తోన్న సంస్థలతో పాటు శ్రేష్ఠ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీ; పెర్ల్ అకాడెమీ, యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, విట్ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, రాంచీ యూనివర్సిటీ, అమిటీ యూనివర్సిటీ, దిల్లీ యూనివర్సిటీ, గాల్గోటియా యూనివర్సిటీ మొదలైనవి ముఖ్యమైనవి.

# డైటింగ్ కష్టమనిపిస్తోందా ? ఈజీగా బరువు తగ్గాలా ? ఈ 5 పనులు చేయండి చాలు !



బరువు తగ్గడం అనేది కేవలం కఠినమైన వ్యాయామం వల్ల మాత్రమే కాదు, మనం తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల కూడా సాధ్యమవుతుంది. మన శరీరానికి కండరాలు పెరగాలన్నా, కడుపు నిండుగా అనిపించాలన్నా ప్రోటీన్ చాలా ముఖ్యం. మనం జంక్ ఫుడ్ తినడానికి ముఖ్య కారణం అది మనకు వెంటనే అందుబాటులో ఉండటమే. అందుకే ప్రోటీన్ ఉన్న ఆహార పదార్థాలను ముందుగానే ఉడికించి ఫ్రిజ్‌లో రెడీ పెట్టుకోవాలని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

అయితే ఉడికించిన గుడ్లు, పనీర్, టోఫు, సోయా, చికెన్ లేదా మాంసం, గ్రీక్ యోగర్ట్ వంటివి ముందుగానే రెడీ చేసి ఉంచుకోవాలి. దీని వల్ల ప్రయోజనం ఏంటంటే ఆకలి వేసినప్పుడు బయటి చిరుతిండ్లు తినకుండా, ఇంట్లో రెడీ ఉన్న ప్రోటీన్ ఆహారాన్ని వెంటనే తినవచ్చు.

**ముందే కట్ చేసి పెట్టుకోండి**

కూరగాయల్లో ఫైబర్ అంటే పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది మీ జీర్ణక్రియకు మంచిది ఇంకా కడుపు నిండినట్లు భావన కలిగిస్తుంది. కూరగాయలను ముందుగానే వండి పెట్టుకోవడం లేదా కనీసం సలాడ్ కోసం ముక్కలుగా కోసి రెడీ ఉంచుకోవడం వల్ల భోజన సమయంలో కూరగాయలను ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది.

**భోజనం తక్కువగా**

చాలామంది పదే పదే ఏదో ఒకటి తింటూ ఉంటారు. అలా కాకుండా,
అవసరమైతే తప్ప తినకూడదని సలహాలు ఇస్తున్నారు నిపుణులు. రోజుకు మూడు పూటల భోజనం సరిపోతుంది. కానీ చాలా ఆకలిగా ఉంటే తప్ప మధ్యలో ఎం తినకండి. ఒకవేళ తినాలనిపిస్తే మధ్యాహ్నానికి, రాత్రికి మధ్యలో చిన్న స్నాక్స్ తీసుకోవచ్చు.

**చిరుతిండిగా పండ్లు**

మధ్యాహ్న భోజనం తర్వాత లేదా సాయంత్రం పూట ఏదైనా తినాలనిపించినప్పుడు సమోసాలు, బిస్కెట్లు లేదా పిజ్జాల జోలికి వెళ్లొద్దు. మీ మూడ్ బాలేనప్పుడు లేదా బోర్ కొట్టినప్పుడు పిజ్జా లాంటివి తినాలనిపిస్తుంది. అలాంటి సమయంలో ఏదైనా ఒక పండు తింటే ఆ కోరిక తగ్గుతుంది ఇంకా కేలరీలు కూడా తక్కువగా అందుతాయి.

**నీళ్లు బాగా తాగండి**

చాలా సార్లు మనకు దాహం వేసినప్పుడు, అది ఆకలి అనుకుని పొరబడి ఏదో ఒకటి తినేస్తుంటాం. దీనివల్ల అనవసరమైన కేలరీలు శరీరానికి చేరుతాయి. కాబట్టి ప్రతిసారి భోజనం చేయడానికి ముందు ఒక గ్లాసు నీళ్లు తాగండి. దీనివల్ల మీరు తక్కువ ఆహారం తింటారు ఇంకా అతిగా తినాలనే కోరిక కంట్రోల్లో ఉంటుంది.

# ఈ సమ్మర్లో ఏసీ అవసరం లేని ఊర్లు: 25 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉండే 6 చల్లని ప్రదేశాలివే!

ఈ వేసవి కాలంలో ఎండలు మండిపోతున్నప్పుడు, ఎక్కడికైనా చల్లని ప్రదేశాలకు వెళ్లాలని ఎవరికైనా అనిపిస్తుంది. ముఖ్యంగా ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్తే మనసుకి, శరీరానికి హాయిగా, రిలాక్స్ గా ఉంటుంది. అలాంటి అద్భుతమైన 6 పర్యాటక ప్రదేశాల గురించి మీకోసం....



**1. తమిళనాడులోని ఊటీ**

ఊటీని క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్స్ అని కూడా పిలుస్తారు. ఈ ప్రదేశం తమిళనాడులోని నీలగిరి కొండల్లో ఉంది. మార్చి నుండి జూన్ వరకు ఇక్కడ వాతావరణం ఉష్ణోగ్రత 15 నుండి 25 డిగ్రీల మధ్య చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ అందమైన సరస్సులు, పూల తోటలు, టీ ఎస్టేట్లు పర్యాటకులను ఆకట్టుకుంటాయి ఇంకా చూడదగ్గవి. ప్రకృతి ప్రేమికులకు ఇది ఒక స్వర్గం లాంటిది.

**2. ఉత్తరాఖండ్ నైనిటాల్**

ఢిల్లీకి దగ్గరగా ఉండి, తక్కువ సమయంలో వెళ్లిరావడానికి నైనిటాల్ ఒక మంచి ప్రదేశం. ఇక్కడ పగటి వాతావరణం చాలా బాగుంటుంది, రాత్రులు మాత్రం చాలా చల్లగా ఉంటాయి. నైని సరస్సులో బోటింగ్ చేయడం, పురాతన దేవాలయాలను దర్శించడం ఇక్కడి ప్రత్యేకత. స్నో వ్యూ పాయింట్ నుండి హిమాలయాల అందాలను కళ్ళారా చూడదగ్గవి.

**3. హిమాచల్ ప్రదేశ్ లోని మనాలి**

సాహసాలు చేయాలనుకునే వారికి మనాలి సరైన గమ్యస్థానం. ఇక్కడ ఎప్పుడూ వాతావరణం చల్లగానే ఉంటుంది. మనాలి ప్రత్యేకతలు ఏంటంటే పారాగ్లైడింగ్, స్కీయింగ్ వంటి సాహస క్రీడలకు పెట్టింది పేరు. అటల్ టన్నెల్ అనే ఇంజనీరింగ్ అద్భుతాన్ని కూడా ఇక్కడ చూడవచ్చు.

**4. సిమ్లా**

హిమాచల్ ప్రదేశ్ లోని మరో ప్రాంతం సిమ్లా.. ఇక్కడ ఒకవైపు ప్రశాంతత, మరోవైపు సందడి.. రెండూ కనిపిస్తాయి. ఇక్కడి వాతావరణం పగటిపూట ఆహ్లాదకరంగా, సాయంత్రం వేళల్లో బాగా చల్లగా ఉంటుంది. ఇక్కడ చూడదగ్గవి మాల్ రోడ్, జఖూ హిల్, రిడ్జ్ వంటి ప్రదేశాలు సందర్శనకు బాగుంటాయి. సిటీ లైఫ్ ఎంజాయ్ చేస్తూనే ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు.

**5. లడఖ్**

విభిన్నమైన దృశ్యాలను చూడాలనుకునే వారు లడఖ్ వెళ్ళవచ్చు. ఇక్కడ పర్వతాలు, ఎడారులు ఒకే చోట కనిపిస్తాయి. ఇక్కడి వాతావరణం ఏడాది మొత్తం చల్లగా ఉంటుంది. లడఖ్ ప్రత్యేకతలు ఏంటంటే పాంగోంగ్ సరస్సు, నుబ్రా వ్యాలీ ఇక్కడి ప్రధాన ఆకర్షణలు. బైకింగ్, క్యాంపింగ్, రివర్ రాఫ్టింగ్ చేసేవారికి ఇదొక ఫేవరెట్ స్పాట్. అలాగే ఇక్కడి టిబెటన్ వంటకాలు కూడా చాలా రుచిగా ఉంటాయి.

**6. మేఘాలయలోని షిల్లాంగ్**

షిల్లాంగ్‌ను స్కాట్లాండ్ ఆఫ్ ఈస్ట్ అని కూడా పిలుస్తారు. ఈ ప్రదేశం అంత అందంగా ఉంటుంది. ఇక్కడి వాతావరణం ఏడాది పొడవునా
చల్లగా, ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడి జలపాతాలు, పచ్చని కొండలు, పైన్ అడవులు ఇక్కడ అద్భుతంగా ఉంటాయి ఇంకా చూడదగ్గవి. ఉమియం సరస్సు, లైట్‌లమ్ కాన్యన్స్‌ను సందర్శించడం ఒక మరపురాని అనుభూతినిస్తుంది. ఎండల నుండి తప్పించుకుని కాస్త రిలాక్స్ అవ్వాలనుకుంటే ఈ వేసవిలో ఈ ప్రదేశాలలో ఏదో ఒకటి ప్లాన్ చేసుకోండి !

# ముప్పైలోనే ముడతలు వస్తున్నాయా..? ఈ నేచురల్ టిప్స్‌తో మళ్ళీ యంగ్ గా మారిపోండి !



ఒకప్పుడు మనిషిని చూడగానే, ఎంత వయసు ఉండొచ్చో ఈజీగా చెప్పగలిగేవాళ్లం. 50 ఏళ్లు దాటితే కానీ తల నెరిసేది కాదు. వయసు 60లను క్రాస్ అయ్యాకే చర్మం ముడతలు పడేది. కానీ ఇప్పుడు ముప్పైట్లోనే ఫేస్లో గ్లో ఆటకెక్కిస్తోంది. నలభైలు దాటుతుండగానే చర్మం ముడతలు పడుతోంది. లాక్ డౌన్ టైంలో ఎంతో కొంత ఖాళీ టైం దొరుకుతోంది. దాన్ని సరిగా వాడుకుంటే యంగ్ గా తయారవ్వొచ్చు. అదికూడా ఇంట్లో దొరికే వాటితోనే...

**తేనె, చక్కెర**

ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ చక్కెర కలపాలి. దాంతో ముఖాన్ని సున్నితంగా స్క్రబ్ చేయాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడుక్కోవాలి. ఇలా చేస్తే డెడ్ స్కిన్ తొలగిపోతుంది.

**అల్లం రసం, టీ**

నీళ్లలో టీ పౌడర్ మాత్రమే వేసి మరిగించి, అందులో కొద్దిగా అల్లం రసం కలపాలి. టి చల్లారాక, అందులో దూది ముంచి ముఖంపై రాయాలి. నిమిషం కంటే ఎక్కువసేపు ముఖం మీద ఉంచకూడదు. వెంటనే కడిగేయాలి. స్కిన్ యంగ్ గా కనపడేలా చేసేందుకు 'టీ' ఉపయోగపడుతుంది.

**అరటిపండు, ఆలివ్ నూనె**

పండిన అరటిపండును మెదిపి, ఒక టీస్పూన్ ఆలివ్ నూనె కలపాలి. దీన్ని ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. పావుగంటయ్యాక చల్లని నీళ్లతో కడగాలి. అరటిలో పొటాషియం, జింక్, విటమిన్ 'ఎ, బి, సి, ఇ' లు ఉంటాయి. ఇది చర్మాన్ని యంగ్ గా ఉంచుతుంది. దీనికి తోడు ఆలివ్ ఆయిల్ మాయిశ్చరైజర్లా పనిచేస్తుంది.

**రోజ్ వాటర్, ద్రాక్షరసం**

ద్రాక్షరసంలో కొన్ని చుక్కల రోజ్ వాటర్ కలపాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖం మీద రాయాలి. ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి.

**నిమ్మరసం, గుడ్డు**

గుడ్డు తెల్లసొనలో ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసాన్ని కలపాలి. ఇందులో దూది ముంచి ముఖం మీద రాయాలి. 20 నిమిషాల తర్వాత, చల్లని నీళ్లతో కడుక్కోవాలి. గుడ్లలో ఉండే ప్రొటీన్లు చర్మాన్ని టైట్ చేస్తాయి. నిమ్మరసం మచ్చలను పోగొడుతుంది.

# బ్యాడ్మింటన్ ఫ్యాన్స్‌కు షాక్.. ఇండోనేషియా ఓపెన్ నుండి సాత్విక్-చిరాగ్ అవుట్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ బ్యాడ్మింటన్ సూపర్‌స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి ఫ్యాన్స్‌కు ఒక బ్యాడ్ న్యూస్.. ప్రస్తుతం జరుగుతున్న ప్రతిష్టాత్మక ఇండోనేషియా ఓపెన్ 2026 (రాబజూవతీ 1000) టోర్నమెంట్ మొదటి రౌండ్ నుంచే ఈ వరల్డ్ నంబర్ 4 జంట తప్పుకుంది. మలేషియాకు చెందిన కాంగ్ ఖై జింగ్, ఆరోన్ తాయ్‌లతో జరుగుతున్న మ్యాచ్‌లో సాత్విక్ కుడి భుజం నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దీంతో ఆటను మధ్యలోనే ఆపేసి కోర్టు నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మ్యాచ్ ఆపే సమయానికి సాత్విక్-చిరాగ్ జోడీ 6--11తో వెనుకంజలో ఉంది.

**బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్లారిటీ:**
సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడి తప్పుకోవడంపై బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఒక అఫీషియల్ స్టేట్‌మెంట్ రిలీజ్ చేసింది. సాత్విక్‌కు గాయం కావడంతో ఇండోనేషియా ఓపెన్ నుంచి తప్పుకుంది.. రాబోయే పెద్ద టోర్నమెంట్ల దృష్ట్యా సాత్విక్ త్వరగా కోలుకోవడానికి, రీహాబిలిటేషన్ పైనే ఇప్పుడు టీమ్ ఫోకస్ పెట్టబోతోంది. సాత్విక్ స్పీడీగా రికవరీ అవ్వాలని కోరుకుంటున్నామని పేర్కొంది.

గత కొన్ని వారాలుగా సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ బ్యాక్-టు-బ్యాక్ మ్యాచ్‌లతో ఫుల్ బిజీగా ఉంది. జస్ట్ కొన్ని రోజుల ముందే థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్స్ రీచ్ అవ్వడమే కాకుండా, గంటకు పైగా సాగిన హోరాహోరీ పోరులో గెలిచి 'సింగపూర్ ఓపెన్' టైటిల్‌ను కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ ఓవర్‌లోడ్ వల్లే సాత్విక్ భుజంపై ప్రెషర్ పడినట్లు తెలుస్తోంది.

**గాయాలపై సాత్విక్ ఓపెన్ టాక్:**
ఇదే ఏడాది ఢిల్లీలో జరగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, అలాగే ఆసియా గేమ్స్ (Asian Games) వంటి మెగా టోర్నీలు ఉండటంతో.. ప్లేయర్స్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ చాలా కీలకంగా మారింది. గాయాల గురించి సాత్విక్ ఇటీవల మాట్లాడుతూ.. ఇంజూరీస్ అనేవి నా ఒక్కడికే కావు, ఎవరి కెరీర్ కూడా 100 శాతం పర్‌ఫెక్ట్‌గా సాగదు.. మనం మన బాడీకి రెస్పెక్ట్ ఇవ్వాలి.. నా స్టైల్ ఆఫ్ ప్లే కొంచెం అటాకింగ్‌గా (Aggressive) ఉంటుంది కాబట్టి అప్పుడప్పుడు ఇలాంటి పెద్ద టోర్నీలు మిస్ అవ్వక తప్పదు.. వాటిని లైట్ తీసుకుని, మెయిన్ టోర్నమెంట్స్ నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించడంపైనే ఫోకస్ పెట్టాలని సూచించాడు.

**ఇండియన్ ప్లేయర్స్ సీన్ ఏంటి?:**
ఒకవైపు సాత్విక్-చిరాగ్ తప్పుకున్నా.. ఇండియాకు మిక్స్‌డ్ డబుల్స్‌లో గుడ్ న్యూస్ అందింది. రోహన్ కపూర్ - శివాని రుత్విక గద్దె జోడీ చైనీస్ తైపీ ప్లేయర్లపై స్ట్రెయిట్ గేమ్స్‌లో సూపర్ విక్టరీ కొట్టి సెకండ్ రౌండ్‌కు దూసుకెళ్లారు.

ఇక సింగిల్స్ విషయానికి వస్తే.. స్టార్ ప్లేయర్ పీవీ సింధు తన మ్యాచ్ గెలిచి నెక్స్ట్ రౌండ్‌కు క్వాలిఫై అవ్వగా, లక్ష్య సేన్, కిదాంబి శ్రీకాంత్ మొదటి రౌండ్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి ఎగ్జిట్ అయ్యారు. ఆయుష్ శెట్టి, హెచ్.ఎస్. ప్రణయ్ తమ మ్యాచ్‌లు త్వరలో స్టార్ట్ చేయనున్నారు.

# భారత్ VS పాక్ మ్యాచ్ ఒక్కటే కాదు.. వరల్డ్ కప్‌కి హైప్ ఇవ్వండి.. స్మృతి మంధాన బోల్డ్ కామెంట్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందు టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన క్రికెట్ ప్రపంచానికి ఒక స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చింది. సాధారణంగా క్రికెట్ టోర్నమెంట్ ఏదైనా సరే.. అందరి ఫోకస్ కేవలం ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ పైనే ఉంటుంది. కేవలం ఈ ఒక్క మ్యాచ్‌నే కాకుండా టోర్నీ మొత్తాన్ని సమానంగా ప్రమోట్ చేయాలని, వరల్డ్ కప్ మొత్తానికి భారీ హైప్ క్రియేట్ చేయాల్సిన అవసరం ఉందని స్మృతి పిలుపునిచ్చింది.

ఈ రెండు ప్రత్యర్థి జట్ల మధ్య జూలై 14వ తేదీన బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ క్రికెట్ గ్రౌండ్‌లో గ్రూప్-ూా మ్యాచ్ జరగనుంది. ఈ మెగా పోరుకు సంబంధించిన టికెట్లు అప్పుడే హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. ఇక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో స్మృతి మంధాన మాట్లాడుతూ.. గతంలో బర్మింగ్‌హామ్‌లోనే జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2022లో మేము పాకిస్తాన్‌తో ఆడినప్పుడు స్టేడియం మొత్తం హౌస్‌ఫుల్ అయ్యింది. కేవలం భారత్-పాక్ మ్యాచ్ మాత్రమే కాదు.. ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ మొత్తాన్ని మనం హైప్ చేయాలి.. ఎందుకంటే ఈ ఒక్క మ్యాచ్‌కు ఎలాగో క్రేజ్ ఉంటుంది.. ఈసారి కూడా మాకు సపోర్ట్ చేయడానికి భారీ సంఖ్యలో అభిమానులు వస్తారని తెలుసు.. ఖచ్చితంగా గ్రౌండ్‌లో అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తామని పేర్కొంది.

**ఫామ్ కోల్పోయిన భారత్.. టెన్షన్‌లో ఫ్యాన్స్:**
గతేడాది (2025) హోమ్ గ్రౌండ్‌లో జరిగిన వన్డే వరల్డ్ కప్‌ను గెలిచి హిస్టరీ క్రియేట్ చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. ఈసారి టీ20 వరల్డ్ కప్‌ను కూడా ముద్దాడాలని కసితో ఉంది. కానీ, ఈ మెగా టోర్నీ కంటే ముందు టీమిండియా ప్రిపరేషన్స్ అంత ఆశాజనకంగా ఏమీ లేవు.. ఇంగ్లాండ్‌తో జరిగిన 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 2--1 తేడాతో చేజార్చుకుంది. తొలి మ్యాచ్ గెలిచి మంచి లీడ్ సాధించినప్పటికీ.. ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం ఫ్యాన్స్‌ను కాస్త కంగారు పెడుతుంది.

**టీమిండియా రీసెంట్ గ్రాఫ్:**
ఇంగ్లాండ్ సిరీస్: 2-1తో ఓటమి (వరల్డ్ కప్‌కు ముందు ఆఖరి సిరీస్).
సౌతాఫ్రికా సిరీస్: 4-1తో ఘోర పరాజయం.
ఆస్ట్రేలియా పర్యటన: ఇదే ఏడాది మొదట్లో ఆస్ట్రేలియా గడ్డపై 2-1తో చారిత్రాత్మక సిరీస్ విజయం.
శ్రీలంక సిరీస్: గత డిసెంబర్‌లో లంకను 5-0తో క్లీన్ స్వీప్ చేసిన భారత్

# ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కోహ్లీ సందడి.. పాపారాజీలతో ఫన్నీ డిస్కషన్ వైరల్




**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును ఐపీఎల్ 2026 విజేతగా నిలిపి, వరుసగా రెండోసారి టైటిల్ గెలిచిన ఆనందంలో ఉన్న మాజీ భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. (2026, జూన్3న) ముంబై ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న కోహ్లీని కవర్ చేయడానికి ఫోటోగ్రాఫర్లు (పాపారాజీలు) ఎగబడ్డారు. క్యాజువల్ వైట్ టీ-షర్ట్‌లో ఎంతో కూల్‌గా కనిపించిన సూపర్‌స్టార్.. కెమెరాలకు నవ్వుతూ ఫోజులు ఇచ్చాడు. అయితే, ఫొటోలు తీసుకున్న తర్వాత కోహ్లీ సరదాగా క్యా కర్నా హై అభీ? (ఇప్పుడు ఏం చేయాలి మరి?) అని హిందీలో అనడంతో అక్కడ నవ్వులు విరిశాయి.

**ఐపీఎల్ విజయం తర్వాత బృందావనంలో కోహ్లీ దంపతులు:**
ముంబై ఎయిర్‌పోర్ట్‌కు రావడానికి ఒక రోజు ముందే, విరాట్ కోహ్లీ తన భార్య అనుష్క శర్మతో కలిసి ఆధ్యాత్మిక నగరమైన బృందావనాన్ని సందర్శించారు. అక్కడ ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ మహారాజ్ ను కలుసుకుని ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు ఆశ్రమంలో గడిపిన ఈ జంట.. ఆ ప్రైవేట్ సమావేశం ముగించుకుని బయటకు వచ్చేటప్పుడు నుదుట చందనం, త్రిపుండ్రం ధరించి కనిపించారు. ఆశ్రమ నిర్వాహకులు వారికి ఒక ప్రత్యేక పుస్తకాన్ని బహుకరించగా, వారు దానిని భక్తితో స్వీకరించారు. ఆ తర్వాత, కోహ్లీ దంపతులు స్వామి హిట్ గోవింద్ శరణ్ ఆశ్రమాన్ని కూడా సందర్శించి వారి బ్లెస్సింగ్స్ తీసుకున్నారు.



# జాన్వీ హొయలు ఆ రేంజులో..



బాలీవుడ్ అందాల నటి జాన్వీ కపూర్ ప్రస్తుతం నటనా రంగంలోనే కాదు.. ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. అటు బాలీవుడ్‌లో తిరుగులేని ఫ్యాషనిస్టాగా గుర్తింపు పొంది.. ప్రతి ఈవెంట్‌లోనూ తన ప్రత్యేకమైన వస్త్రధారణతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీ - సినిమాల మధ్య సమతుల్యతను కాపాడుకుంటూ ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా జాన్వీ ప్రముఖ పంజాబీ గాయకుడు ఆలపించిన గీతానికి అందమైన ఎక్స్ ప్రెషన్స్ తో ఇమ్మిటేట్ చేస్తూ యూత్ ని టీజ్ చేస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోయిన్‌గా ఎదగాలనే లక్ష్యంతో ఉన్న జాన్వీకి, ఎన్టీఆర్ సరసన నటించిన -దేవర- చిత్రం భారీ విజయాన్ని అందించడమే కాకుండా.. ఇక్కడ బలమైన పునాదిని వేసింది. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన -పెద్ది- సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందని భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో రామ్ చరణ్ లాంటి పాన్ ఇండియా హీరోలతో పనిచేయడం జాన్వీ మార్కెట్ వాల్యూను మరింత పెంచుతోంది. -పెద్ది- చిత్ర బృందం ఇప్పటివరకు జాన్వీకి సంబంధించిన విజువల్స్ ని కానీ.. తన పాత్ర స్వభావాన్ని వెల్లడించకుండా సస్పెన్స్ మెయింటెయిన్ చేస్తోంది. అయితే సుకుమార్ రైటింగ్స్ వంటి ప్రతిష్టాత్మక బృందాలు రూపొందిస్తున్న చిత్రాల్లో నాయిక పాత్రలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. జాన్వీ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా నటిగా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. నటిగా తన అస్తిత్వాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి జాన్వీకి ఇది సదవకాశం.జాన్వీ తన తల్లి శ్రీదేవి నటించిన -జగదేకవీరుడు అతిలోకసుందరి- వంటి క్లాసిక్ చిత్రాల సీక్వెల్స్‌లో నటించాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. -పెద్ది- తర్వాత రామ్ చరణ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే వైజయంతి అధినేత అశ్వినీదత్ నుండి ఇంకా ఎటువంటి స్పష్టత రాలేదు. ఇటువంటి వారసత్వ బాధ్యతాయుతమైన చిత్రాలు జాన్వీ కెరీర్‌కు మరో పెద్ద మలుపునిస్తాయనడంలో సందేహం లేదు.

కెరీర్ ప్రారంభంలోనే ఉత్తరాది- దక్షిణాది వంటి విభిన్న ప్రాంతీయ భాషా చిత్రాలను ఎంచుకోవడం వల్ల జాన్వీ పలు రకాల పని సంస్కృతులను అర్థం చేసుకునే అవకాశం పొందుతోంది. ఇలాంటి పాన్-ఇండియా ప్రయత్నాలు జాన్వీని ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా గ్లోబల్ ఆడియన్స్‌కు చేరువ చేస్తున్నాయి. మొత్తానికి శ్రీదేవి నటవారసురాలిగా జాన్వీ ఎంచుకుంటున్న ఈ భారీ చిత్రాలు తనను కేవలం ఒక బాలీవుడ్ నటిగానే కాకుండా.. దక్షిణాదిలో కూడా తిరుగులేని స్టార్‌గా నిలబెట్టే అవకాశం ఉంది.



సాక్షి మాలిక్ గోల్డెన్ గ్లామర్‌లో టైమ్‌లెస్ గాంభీర్యంతో మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965